teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 250 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 12 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## కొత్తగూడెంలో "గ్రీన్ ఫీల్డ్" ఎయిర్ పోర్టుకు అడుగులు

### ఈ నెల 20న కొత్తగూడెంలో పర్యటించనున్న కేంద్ర బృందం



భద్రాద్రికొత్తగూడెం, జనవరి 11 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నియోజకవర్గంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు ఏర్పాటుకు అడుగు ముందుకుపడింది. ఎయిర్ పోర్టు ఏర్పాటుకు అవసరమైన ల్యాండ్ పరిశీలనకు ఈ నెల 20న కొత్తగూడెంలో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన కేంద్ర బృందం పర్యటించనుంది. కేంద్ర బృందం పర్యటన, డీపీఆర్‌కు అయ్యే ఖర్చులకు గానూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 38లక్షలను ఇటీవలే శాంక్షన్ చేస్తూ ఆదేశిలిచ్చింది. కాగా విమానశ్రయ ఏర్పాటుతో కొత్తగూడెంకు మహర్ధశ పట్టనుందని అగ్రికల్చర్ మినిస్టర్ తుమ్మల నాగేశ్వరరావు ఇటీవలే ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



పూర్తి స్థాయి అమలుకు
ప్రభుత్వ సన్నాహాలు

# ఫిబ్రవరి 28లోగా భూ భారతి చట్టం

- పొరపాట్లు జరగకుండా అమలుకు ప్రణాళికలు
- ధరణిలో ఆక్రమించిన భూములు వెనక్కి తీసుకుంటాం
- తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం
- ఈ మేరకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ వెల్లడి రెడ్డి




"భూ భారతి చట్టం కోసం చాలా కష్టపడ్డామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 15 నుంచి 28వ తేదీలోపు ఈ చట్టం పూర్తిగా అమల్లోకి వస్తుందని వెల్లడించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా దీనిని అమలు చేస్తామని చెప్పారు. ధరణి ద్వారా ఆక్రమించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, ధరణిని వాడుకుని తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.

– హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్):

# త్వరలో కొత్త బీరు బ్రాండ్లు

- ఎక్సైజ్ శాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా
- బీర్ల ధరల అంశంపై కీలక చర్చ
- ఇతర రాష్ట్రాల్లో బీర్ల ధరలను పరిశీలించాలని ఆదేశాలు

ఎక్సైజ్ శాఖ అధికారులతో సచివాలయం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశం ముగిసింది. బీర్ల ధరల అంశంపై సమావేశంలో కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.



హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): ఎక్సైజ్ శాఖ అధికారులతో సచివాలయం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశం ముగిసింది. బీర్ల ధరల అంశంపై సమావేశంలో కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ

మిగతా 2 లో



## వరుస సెలవులతో ఖాళీగా దర్శనమివ్వనున్న మహానగరం

- పండుగ వేళ అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖ సూచన
- ఊరికి వెళ్తే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలి

02

## త్వరలో వరంగల్ జూ పార్క్‌కు తెల్ల పులులు, సింహాలు

రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి
పార్క్ అభివృద్ధి పనులకు కోటి రూపాయలతో శంకుస్థాపన





.. వివరాలు 2లో

## పల్లె బాటలో.. పట్నం వాసులు

- హైదరాబాద్ విజయవాడ హైవేపై ఫుల్ రష్
- ఒకవైపు సంక్రాంతి పండగ.. మరోవైపు శని ఆది సెలవులు
- స్తంభించిపోయిన హైదరాబాద్ రోడ్లు

తెలంగాణ బ్యూరో, జనవరి 11 (తీన్మార్ న్యూస్): ఒకవైపు సంక్రాంతి పండగ.. మరోవైపు శని, ఆదివారాలు కలిసిరావడంతో లక్షల మంది జనం సొంతూర్లకు క్యూకట్టారు. దాంతో, హైదరాబాద్ రోడ్లు

మిగతా 2 లో





## మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక కామెంట్స్

- సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ.. చేరికలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నాం

02

## ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తూ.చ తప్పకుండా ఖర్చు చేస్తాం

### డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రకటన



హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తూ.చ తప్పకుండా ఖర్చు చేసే బాధ్యత నాది అని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ఖర్చులు చేస్తున్నారా లేదా అనే అంశంపై ఇప్పటికే అధికారుల నుంచి నివేదిక కోరామన్నారు. నివేదికలు వచ్చాక పక్కాగా అమలు చేసే బాధ్యత ఈ ప్రభుత్వానిదన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావడంతోనే తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఖర్చు

మిగతా 2 లో




## దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత భాగస్వామ్యం ప్రత్యేకం : ప్రధాని మోదీ

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ అనేది దేశాభివృద్ధి ప్రయాణంలో దేశ యువతను భాగస్వామ్యం చేయడానికి ఒక ప్రత్యేకమైన చొరవ అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నేషనల్ యూత్ ఫెస్టివల్ 2025 మరియు విక్షిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌పై యువజన వ్యవహారాలు మరియు క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే రాసిన కథనాన్ని మోదీ శనివారం పంచుకున్నారు.

న్యూ ఢిల్లీ, జనవరి 11 (తీన్మార్ న్యూస్): విక్షిత్ భారత్ యొక్క దృక్పథాన్ని సాకారం చేసుకోవడానికి ఈ కార్యక్రమం యువ మనస్సులలోని శక్తి, సృజనాత్మకత మరియు నాయకత్వాన్ని చానెల్ చేయడానికి ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. నేడు జాతీయ యువజన

మిగతా 2 లో

## కర్తవ్య పథ్ పరేడ్‌కు తెలంగాణ నుంచి 41 మంది ఎంపిక

### ఢిల్లీకి వెళ్లడానికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ఏర్పాట్లు



తెలంగాణ బ్యూరో, జనవరి 11 (తీన్మార్ న్యూస్ ): న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు తెలంగాణ నుంచి ప్రత్యేకంగా 41 మందిని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారుల జాబితా నుంచి వీరిని

మిగతా 2 లో



## ఈనెల 27న తెలంగాణలో ఖర్గే, రాహుల్ గాంధీ పర్యటన

- ఈ మేరకు కాంగ్రెస్ హైకమాండ్ అధికారిక ప్రకటన విడుదల
- ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయం

02

## వేసవిలో విద్యుత్ సరఫరాకు ప్రణాళికలకు సీఎం ఆదేశాలు

### అంతరాయం లేకుండా డిస్కంలు సన్నద్ధంగా ఉండాలి

హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): వేసవిలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా డిస్కంలు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ- 2025ని

మిగతా 2 లో



## హైదరాబాద్‌లో జాతీయ స్థాయి పబ్లిక్‌సర్వీస్ కమిషన్ సదస్సు

- ఈ యేడాది డిసెంబర్‌లో నిర్వహించబడనున్న సదస్సు
- ఈ మేరకు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్‌ల నిర్ణయం




హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌మరో కీలక సమావేశానికి వేదిక కానుంది. జాతీయ స్థాయిలో నిర్వహించే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ల సదస్సుకు హైదరాబాద్ వేదిక

మిగతా 2 లో

# ఫిబ్రవరి 28లోగా భూ "భారతి" చట్టం

హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): భూ భారతి చట్టం కోసం చాలా కష్టపడ్డామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 15 నుంచి 28వ తేదీలోపు ఈ చట్టం పూర్తిగా అమల్లోకి వస్తుందని వెల్లడించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా దీనిని అమలు చేస్తామని చెప్పారు. ధరణి ద్వారా ఆక్రమించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, ధరణిని వాడుకుని తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. భూ భారతి చట్టం ధరణి పోర్టల్‌కు బదులుగా కొత్తగా ప్రవేశపెట్టిన ఒక భూ రికార్డుల నిర్వహణ వ్యవస్థ. ఈ చట్టం ప్రధానంగా భూమికి సంబంధించిన వివాదాలను తగ్గించడం, భూ రికార్డులను మరింత పారదర్శకంగా నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకుంది.




**భూ భారతి చట్టం ప్రధాన లక్షణాలు**

- ధరణి పోర్టల్‌కు ప్రత్యామ్నాయం: ఈ చట్టం ధరణి పోర్టల్‌లో ఉన్న కొన్ని లోపాలను సరిదిద్దేందుకు రూపొందించబడింది.
- సరళీకృత ప్రక్రియ: భూమికి సంబంధించిన విషయాలను నమోదు చేయడం, మార్పులు చేయడం వంటి ప్రక్రియలను సరళీకృతం చేసింది.
- పారదర్శకత: భూ రికార్డులను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి పారదర్శకతను పెంచింది.
- భూ వివాదాల తగ్గింపు: భూమికి సంబంధించిన వివాదాలను తగ్గించడానికి అవసరమైన చర్యలు చేపట్టింది.
- రైతులకు ప్రయోజనం: ఈ చట్టం రైతులకు భూమికి సంబంధించిన విషయాలపై మరింత స్పష్టతనిస్తుంది.

**భూ భారతి చట్టం ప్రధాన మార్పులు**

- మాడ్యూళ్ల సంఖ్య తగ్గింపు: ధరణి పోర్టల్‌లో ఉన్న 33 మాడ్యూళ్లను భూ భారతిలో 6 మాడ్యూళ్లకు తగ్గించారు.
- రద్దయిన అనుభవదారుడి కాలమ్‌ను తిరిగి చేర్చారు: ధరణి పోర్టల్‌లో రద్దయిన అనుభవదారుడి కాలమ్‌ను భూ భారతిలో తిరిగి చేర్చారు.
- మ్యుటేషన్‌కు మ్యాప్ తప్పనిసరి: భూమికి సంబంధించిన మ్యుటేషన్ చేయాలంటే మ్యాప్ తప్పనిసరి చేశారు.
- క్షేత్రస్థాయి విచారణ: భూమికి సంబంధించిన వివాదాలు ఉంటే క్షేత్రస్థాయిలో విచారణ చేయడానికి నిబంధనలు చేర్చారు.
- ప్రతి భూకమతానికి భూ ఆధార్: ప్రతి భూకమతానికి భూ ఆధార్‌ను అనుసంధానం చేయాలని నిర్ణయించారు.

**ఈ చట్టం ద్వారా ఎవరికి ప్రయోజనం?**

- రైతులు: భూమికి సంబంధించిన విషయాలపై స్పష్టత, భూ వివాదాల పరిష్కారం.
- భూ కొనుగోలుదారులు: భూమికి సంబంధించిన సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం.
- ప్రభుత్వం: భూ రికార్డులను సమగ్రంగా నిర్వహించడం ద్వారా పాలనను మరింత సమర్థవంతంగా చేయడం. కాగా భూ భారతి చట్టం తెలంగాణ రాష్ట్రంలో భూమికి సంబంధించిన విషయాలను మరింత పారదర్శకంగా నిర్వహించడానికి తీసుకున్న ఒక ముఖ్యమైన నిర్ణయం. ఈ చట్టం రైతులు, భూ కొనుగోలుదారులు మరియు ప్రభుత్వం అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

## పల్లె బాటలో.. పట్నం వాసులు

మొదటి పేజీ తరువాయి

స్తంభించిపోయాయ్ నగరం నలుమూలలా ఎటుచూసినా రద్దీనే కనిపిస్తోంది. రహదారులే కాదు.. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్లతో పాటు ఎంజీబీఎస్, జేబీఎస్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయ్. మెయిన్‌గా, హైదరాబాద్-విజయవాడ హైవేపై ఫుల్ రష్ ఏర్పడింది. పంతంగి, కొర్లపహాడ్ టోల్ గేట్ల దగ్గర కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దాంతో, ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. హైదరాబాద్- విజయవాడ హైవే.. హెవీ ట్రాఫిక్‌తో నిండిపోయింది. వేలాది వాహనాలు ఒక్కసారిగా రోడ్డెక్కడంతో.. ట్రాఫిక్ వెరీవెరీ స్లోగా కదులుతోంది. జిల్లాకు వెళ్లే రహదారులపైనా భారీ రద్దీ నెలకొంది. టోల్ గేట్ల దగ్గర వెహికల్స్ జామ్ అవుతున్నాయ్. హైదరాబాద్, విజయవాడ హైవేపై ఫుల్ రష్ ఏర్పడింది. పంతంగి, కొర్లపహాడ్ టోల్ గేట్ల దగ్గర కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దీంతో వాహనాల రద్దీ నివారించేందుకు పోలీసులు, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టింది. రహదారులే కాదు.. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్లతో పాటు ఎంజీబీఎస్, జేబీఎస్‌లు రద్దీగా మారాయి. సంక్రాంతి ప్రయాణికుల రద్దీతో హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులు కిటకిటలాడుతున్నాయ్. మరోవైపు, సంక్రాంతి రద్దీని క్యాష్ చేసుకుంటున్నాయ్ ప్రైవేట్ ట్రావెల్స్. డబుల్ త్రిపుల్ ఛార్జీలు వసూలుచేస్తూ ప్రయాణీకులకు చుక్కలు చూపిస్తాయి. వెయ్యి రూపాయలు ఉండే టికెట్ ధర రెండింతలు మూడింతలు పెంచేసి వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే సాధారణంగా వెయ్యి లోపే ఖర్చు అవుతోంది. కానీ 1500 నుంచి 2500 వరకు వసూలు చేస్తున్నారు. రాజమండ్రి టికెట్ హైదరాబాద్ నుంచి 1500కి మించదు కాని.. 4వేల రూపాయలకు అమ్ముతున్నారు. నాన్ ఏసీ అయితే 2వేలు ఉంది. వైజాగ్‌కు ఆర్టీసీ బస్సులో 2వేల రూపాయల్లోపే టికెట్ ఉంటే.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు 3వేల నుంచి 5500 వరకు వసూలు చేస్తున్నాయి. స్లీపర్ అయితే 6వేల రూపాయల దాకా చార్జ్ చేస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

## త్వరలో వరంగల్ జూ పార్క్‌కు తెల్ల పులులు, సింహాలు

వరంగల్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): వరంగల్‌లోని కాకతీయ జూ పార్క్‌కు త్వరలోనే తెల్ల పులులు, సింహాలను తీసుకొస్తామని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. పార్క్‌లో మౌలిక సదుపాయాల కోసం కోటి రూపాయలతో అభివృద్ధి పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నా చేతుల మీదుగా ప్రజల సందర్శనార్థం జూ పార్కులో 4 రకాల జంతువులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ జూ పార్క్ నుంచి రెండు పులులను కాకతీయ జూకి తీసుకొస్తామని తెలిపారు. హైదరాబాద్ జూ పార్క్ తర్వాత రాష్ట్రంలో అతిపెద్ద జూ పార్క్ మన వరంగల్‌లోనే ఉందన్నారు. ప్రస్తుతం మన దగ్గర ఉన్న జూ పార్కు మీడియం స్థాయిలో ఉందని జూను మరింత విస్తరింపజేయాలని కేంద్రానికి నివేదికలు పంపించామని కేంద్ర ప్రభుత్వం కూడా ఇందుకు సానుకూలంగా స్పందిస్తుందని నమ్మకం ఉందన్నారు. జూ పార్క్ అభివృద్ధికి ఇంకా ఎంత ఖర్చైనా చేస్తామని అందుకోసం కమిషనర్‌ను నివేదిక సమర్పించాలని ఆదేశించామని తెలిపారు. ఈ జూ పార్కులో కేవలం జంతువులే కాకుండా మంచి వృక్షాలు కూడా ఉన్నాయని, ఇందులో పనిచేస్తున్న అధికారులు వాటిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత భాగస్వామ్యం ప్రత్యేకం : ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

దినోత్సవం సందర్భంగా, ప్రధాని మోదీ న్యూఢిల్లీలోని భారత్ మండపంలో విక్షిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2025లో పాల్గొంటారు. దేశం నలుమూలల నుండి మూడు వేల మంది చైతన్యవంతమైన యువ నాయకులతో శ్రీ మోదీ నిమగ్నమై ఉంటారని మా ప్రతినిధి నివేదించారు. విక్షిత్ భారత్ ఛాలెంజ్ ద్వారా దేశవ్యాప్తంగా మూడు వేల మంది యువ నాయకులను ఎంపిక చేశారు. దేశం యొక్క భవిష్యత్తు నాయకులను ప్రేరేపించడానికి, ప్రేరేపించడానికి మరియు శక్తివంతం చేయడానికి రూపొందించబడిన బహుళ కార్యకలాపాలలో ప్రధాన మంత్రి పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో, యువ నాయకులు విక్షిత్ భారత్ కోసం వారి విజన్‌పై వారి ప్రదర్శనను ప్రదర్శిస్తారు. ఈ ప్రెజెంటేషన్‌లు భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న ఆలోచనలు మరియు పరిష్కారాలను ప్రతిబింబిస్తాయి. మిస్టర్ మోదీ యువ నాయకులతో కలిసి భోజనం చేస్తారు, వారి ఆలోచనలు, అనుభవాలు మరియు ఆకాంక్షలను నేరుగా తనతో పంచుకునే అవకాశాన్ని కల్పిస్తారు. పది ఇతివృత్తాలపై పాల్గొనేవారు రాసిన ఉత్తమ వ్యాసాల సంకలనాన్ని కూడా ప్రధాని విడుదల చేస్తారు. ఈ థీమ్‌లు సాంకేతికత, సుస్థిరత, మహిళా సాధికారత, తయారీ మరియు వ్యవసాయం వంటి విభిన్న రంగాలను కలిగి ఉంటాయి. విక్షిత్ భారత్ డైలాగ్ యువ నాయకులకు విధాన నిర్ణేతలు మరియు జాతీయ మరియు గ్లోబల్ దిగ్గజాలతో నేరుగా నిమగ్నమయ్యే అవకాశాన్ని అందిస్తోంది, అదే సమయంలో దేశం యొక్క భవిష్యత్తును రూపొందించడానికి వారి ఆలోచనలను అందిస్తోంది.

## వేసవిలో విద్యుత్ సరఫరాకు ప్రణాళికలకు సీఎం ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటుకు అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. వివిధ దేశాల్లోని బెస్ట్ పాలసీని పరిశీలించి రిపోర్ట్ అందించాలని ఆదేశించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ లోపల పూర్తిగా అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమ అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని హైదరాబాద్‌లో అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తన ఆలోచనలను అధికారులతో పంచుకున్నారు. విద్యుత్ కేబుల్స్‌తో పాటు అన్ని రకాల కేబుల్స్‌కు అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని చెప్పారు. అండర్ గ్రౌండ్ కేబుల్ విధానం ద్వారా విద్యుత్ నష్టాలను తగ్గించడంతో పాటు విద్యుత్ చౌర్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ అంతరాయం వంటి సమస్యలను అధిగమించవచ్చని ముఖ్యమంత్రి వివరించారు.

## వరుస సెలవులతో ఖాళీగా దర్శనమివ్వనున్న మహానగరం

హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి పండుగ వేళ వరుస సెలవులు రావడంతో మహా నగరం ఖాళీగా దర్శనమివ్వనుంది. ఈ క్రమంలో పండుగ వేళ అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖ సూచిస్తుంది. ఊరికి వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాల్సిందిగా పత్రిక ప్రకటనల ద్వారా, సోషల్ మీడియా ద్వారా తెలుపుతున్నారు. అలాగే కొన్ని ప్రత్యేక యాప్ ల ద్వారా సూచనలు చేస్తున్నారు. సంక్రాంతి పండుగ మరో రెండు రోజుల్లో వచ్చేస్తుంది. ఈ నేపథ్యంలో చాలామంది సొంత ఊరికి వెళ్లడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. చాలా వరకు ఉద్యోగాల నిమిత్తం, వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్‌కు ఇతర ప్రాంతాలకు వలసలు వస్తుంటారు. ఈ క్రమంలో సొంతూళ్లకు వెళ్లే వారు నగరాల్లో ఉన్న తమ ఇంటికి తాళం వేసుకుని బయటకు రావాల్సి ఉంటుంది.




**సీసీ కెమెరా పర్యవేక్షణ ఉండాలి**

సంక్రాంతి పండుగ సమయంలో వరుస సెలవులు రావడంతో హైదరాబాద్ , సికింద్రాబాద్ జంట నగరాలు ఖాళీగా దర్శనమివ్వనున్నాయి. ఈ తరుణంలో ఊర్లకు వెళ్లిన వారు సిటీ ఉన్న ఇల్లు, అపార్ట్మెంట్ లలో సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని పోలీసు శాఖ సూచనలు చేస్తుంది. అదే విధంగా థెఫ్ట్ అలారమ్ లాంటి వాటిని వినియోగించుకోవడం ద్వారా విలువైన వస్తువుల భద్రత పెరుగుతందని, దొంగతానలకు గురైతే అప్రమత్తంగా ఉండవచ్చని సూచిస్తున్నారు.

**వరుస సెలవులు రావడంతో ఖాళీగా మారిన మహానగరం**

శనివారం నుంచి వరుస సెలవులు రావడంతో ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగుల అనే తేడా లేకుండా అందరూ సొంత ఊర్లకు బయలు దేరారు. 11వ తేదీ నుండి 19 వ తేదీ వరకు విద్యాసంస్థలకు సెలవులు రావడంతో ఈ సారి అధిక సంఖ్యలో వెళుతున్నారు. శనివారం ఒక్కరోజే ఏపీకి 43,948 వాహనాలు హైదరాబాద్ నుంచి వెళ్లాయి.

**పోలీస్ శాఖ అప్రమత్తం**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో వరుస సెలవులతో అందరూ ఊర్లకు వెళ్లడంతో పోలీస్ శాఖ అప్రమత్తం అయింది. ప్రత్యేక బృందాలను పెట్రోలింగ్ కు చేసేందుకు నియమించారు. ఏఆర్ సిబ్బందిని కూడా వినియోగించుకోనున్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరెట్ల సీపీ లు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఏరియాలో అధనంగా 10 టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఊర్లకు వెళుతున్న వారు స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశారు. డయల్ 100 ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. డయల్ 100 కు కాల్ చేస్తే గతంలో 15 నిమిషాల పట్టేదని, ప్రస్తుతం 7 నిమిషాలలో కాల్ చేసిన ప్రాంతానికి సిబ్బంది అందుబాటులో ఉంటారని పోలీస్ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

## ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తూ.చ తప్పకుండా ఖర్చు చేస్తాం

మొదటి పేజీ తరువాయి



చేసుకోగలిగామని ఈ విషయాన్ని మీరంతా వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. శనివారం నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ లో ఆదివాసీ సాధికారత శిక్షణ ముగింపు కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క ఆదివాసీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో చట్టాలు తెచ్చింది. వాటిని అమలు చేయించుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో హక్కులతో పాటు మా స్వేచ్ఛను కోల్పోయామని రాష్ట్ర ప్రజలు కోరి ఈ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. మీరే ఈ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలన్నారు. గత పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం ఇండ్ల పంపిణీ బంద్ చేశారు. కానీ మేము మళ్లీ ప్రారంభిస్తున్నామన్నారు. అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇస్తామని ఎస్సీ, ఎస్టీలకు అదనంగా మరో రూ.1 లక్ష ఇవ్వబోతున్నామన్నారు. గిరిజన ఆదివాసులు అడవులను తమ తల్లిగా భావిస్తూ జీవనం సాగిస్తున్నారు. వలస పాలకులు, గిరిజనులపై ప్రేమలేని వ్యక్తులు అడవుల నుంచి గిరిజనులను దూరం చేసే ప్రయత్నం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారికోసం తెచ్చిన చట్టాలను అమలు చేసే ప్రయత్నం చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ దేశ స్వాతంత్ర్యం కోసం మిగతావారితో పాటు గిరిజనులు పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఈ దేశంలో హక్కుల కోసం పోరాటం చేయడానికి కావాల్సిన ధైర్యం, స్వేచ్ఛను ఇచ్చింది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. గిరిజనుల కోసం తీసుకువచ్చిన చట్టాలు ఇప్పటికీ ఆశ్చర్యం వేస్తుందన్నారు. వాటిని అమలు చేసుకోలేకపోతే అది మన దౌర్భాగ్యం అవుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి అనేక శిక్షణ తరగతులను నిర్వహిస్తూ 2026 నాటికి 20 వేల మంది సైనికులను తయారు చేస్తామన్నారు. బడ్జెట్ లో ఎస్సీ, ఎస్టీ జనాభాకు తగ్గకుండా 10 శాతానికి తగ్గకుండా నిధుల కేటాయింపులు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో తండాలను గ్రామ పంచాయతీలుగా చేశారే తప్ప వాటికి మౌలిక సదుపాయాల కల్పన విషయాలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి తండాలో పంచాయతీ భవనం, స్కూల్ బిల్డింగ్, అంగన్ వాడీ కేంద్రాలను నిర్మిస్తామన్నారు. వైద్యసదుపాయానికి సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామన్నారు. వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. 2029లో కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎస్సీలు, గిరిజనులకు సముచిత స్థానం ఉంటుందన్నారు. బడుగులు బలహీన వర్గాల హక్కుల కోసం దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివాసీలతో కాంగ్రెస్ పార్టీకి పేగుబంధం అన్నారు.

## కర్తవ్య పథ్ పరేడ్‌కు తెలంగాణ నుంచి 41 మంది ఎంపిక

మొదటి పేజీ తరువాయి



ఎంపిక చేశారు. తెలంగాణ నుండి ప్రత్యేక అతిథులుగా అదనంగా 41 మంది పేర్లను విడుదల కేంద్ర రక్షణశాఖ విడుదల చేసింది. వీరు ఢిల్లీకి వెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. నోడల్ అధికారులను నియమించారు. ఎంపికైన వారిలో ప్రధానమంత్రి యశవి స్కీమ్, టెక్స్‌టైల్ (హస్తకళలు), డబ్ల్యూసీడీ (హస్తకళలు)కి గణనీయంగా సహకరించిన వ్యక్తులు. పరేడ్‌ను వీక్షించడానికి పాన్-ఇండియా నుండి ఆహ్వానించబడిన ప్రత్యేక అతిథులు వివిధ రంగాలలోని వివిధ రంగాలకు చెందినవారు ఉన్నారు. ఇందులో వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారు, ప్రభుత్వ పథకాలను సంపూర్ణంగా ఉపయోగించుకున్నవారు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన ప్రత్యేక అతిథుల కేటగిరీల మొత్తం జాబితాలో పీఎం యశస్వి స్కీం నుంచి 23 మంది, టెక్స్‌టైల్స్(హస్తకళలు) నుంచి 3, డబ్ల్యూసీడీ (హస్తకళలు) నుంచి 5, రూరల్ డెవలప్మెంట్ విభాగం నుంచి 12, రిపబ్లిక్ డే పరేడ్ స్టేట్ నోడల్ ఆఫీసర్ గా అంకం రాజేశ్వర్, పీఎం జన్మన్, గిరిజన వ్యవహారాల విభాగం నుంచి 7, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ట్రెయిని డీజీటీ శ్రావ్య, పీఎం మత్స్య సంపద యోజన పథకం లబ్దిదారులు 4, వారికి నోడల్ ఆఫీసర్గా మహ్మద్ ఖాదీర్ అహ్మద్, మన్ కీ బాత్ ప్రోగ్రాంలో పాల్గొన్న అభ్యర్థులు 15 మంది ఉన్నారు.

## ఈ నెల 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్స్ ఫెస్టివల్

**పతంగుల ప్రదర్శనకు టూరిజం శాఖ పరేడ్ గ్రౌండ్లో ఏర్పాట్లు**

**కైట్స్ తో పాటు స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు మంత్రి జూపల్లి వెల్లడి**

హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లో జనవరి 13 నుంచి 15వ తేదీ వరకు ఇంటర్నేషనల్ కైట్స్ అండ్ స్వీట్ ఫెస్టివల్ జరగనుంది. రాష్ట్ర టూరిజం శాఖ పరేడ్ గ్రౌండ్లో ఫెస్టివల్ ని నిర్వహిస్తోంది. హైదరాబాద్ కి వస్తున్న ఇండోనేషియా స్విజర్లాండ్ ఆస్ట్రేలియా, శ్రీలంక ఇటలీ వంటి దేశాలకు చెందిన అంతర్జాతీయ కైట్ ఫ్లెయిర్స్ జనవరి 13 ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు పతంగుల ప్రదర్శన చేయనున్నారు. కైట్స్ తో పాటు స్వీట్ ఫెస్టివల్ ని కూడా నిర్వహిస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ పిండి వంటలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ వంటకాలకు సంబంధించిన ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 700 మంది హోం మేకర్స్ ఈ ఫెస్టివల్ లో పాల్గొంటున్నారు. కైట్స్ అండ్ స్వీచ్ ఫెస్టివల్ కి వచ్చే వాళ్ళకి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని చెప్పారు. మూడు రోజులపాటు లక్షమంది పైనే హాజరవుతున్నట్లు అంచనా వేశారు మంత్రి జూపల్లి. మరోవైపు స్వీట్ ఫెస్టివల్ లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను స్టాల్స్ లో అందుబాటులో ఉంచనున్నారు నిర్వాహకులు. వీటితో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాలకు సంబంధించిన స్టాల్స్ ఉండనున్నాయి. సందర్శకులెవ్వరికీ అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతరశాఖల అధికారులు. కైట్ ఫెస్టివల్ ఎగ్జిబిషన్ కు అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు అధికారులు.

## త్వరలో కొత్త "బీరు" బ్రాండ్లు

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో బీర్ల ధరలను పరిశీలించాలని ఆదేశించారు. కమిటీ నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త కంపెనీలకు అనుమతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సరఫరాకు ముందుకొచ్చే కంపెనీల ఎంపికకు పారదర్శక విధానం పాటించాలని చెప్పారు. ఏడాది నుంచి ఎక్సైజ్ శాఖకు బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలను క్రమంగా క్లియర్ చేయాలని సూచించారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. అంతకుముందు ఈనెలాఖరు కల్లా ఉస్మానియా దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

## మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక కామెంట్స్

హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్ర్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు పీసీసీ చీఫ్. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. వచ్చే 20 ఏండ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని హైకమాండ్ గట్టి వార్నింగ్ ఇచ్చిందని తెలిపారు. ఈ నెల చివరి నాటికి పార్టీలో అన్ని కమిటీలను నియమిస్తామని తెలిపారు. కార్పొరేషన్ పదవుల భర్తీ నెలలోపు అయిపోతుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేవంత్ పర్యటన నేపథ్యంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్వయంగా మంత్రి వర్గ విస్తరణపై ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.

## ఈనెల 27న తెలంగాణలో ఖర్గే, రాహుల్ గాంధీ పర్యటన

హైదరాబాద్, జనవరి 11 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఈనెల 27న తెలంగాణ పర్యటనకు రానున్నారని కాంగ్రెస్ హైకమాండ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా తెలంగాణలో జరగనున్న సంవిధాన్ బచావో ప్రదర్శనలో వారు పాల్గొనబోతున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, జనవరి 26, 2024 నుంచి జనవరి 26, 2026 వరకు దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర'ను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ యాత్రను విజయవంతం చేయడానికి అన్ని స్థాయిల కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం పార్టీ శ్రేణులకు రాసిన లేఖలో, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ చొరవ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్టీ విస్తృత కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. 'సంవిధాన్ బచావో' ఉద్యమానికి ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలుస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనబోతున్నారు.

## హైదరాబాద్ లో "జాతీయ స్థాయి" పబ్లిక్‌సర్వీస్ కమిషన్ సదస్సు

మొదటి పేజీ తరువాయి


కానుంది. ఈ యేడాది డిసెంబర్‌లో ఈ సదస్సు నిర్వహిస్తారు. ఈ నిర్ణయాన్ని శనివారం బెంగళూరులో జరిగిన రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్‌ల సమావేశంలో నిర్ణయించారు. బెంగుళూరులోని హోటల్ తాజ్ వెస్ట్ ఎండ్‌లో శనివారం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ల 25వ జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సును భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ ప్రారంభించారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య, కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, యూపీఎస్సీ చైర్ పర్సన్ ప్రీతి సుదాన్ టీజీపీఎస్సీ చైర్మన్ చైర్మన్ బుర్రా వెంకటేశం, అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ల న్యాయపరమైన అంశాలను అధ్యయనం చేయడానికి సబ్ కమిటీని నియమించారు. ఈ కమిటీ కి తెలంగాణ చైర్మన్ బుర్రా వెంకటేశం నేతృత్వం వహించనున్నారు. ఈ నిర్ణయాన్ని బెంగళూరులో ప్రకటించారు. ఈ సమావేశంలో బుర్రా వెంకటేశం రాష్ట్రంలో చేపట్టిన నియామకాలు, వాటి పురోగతి, పరీక్షల్లో అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు, రాబోయే రోజుల్లో తీసుకు రాబోయే సంస్కరణలు తదితర అంశాలను ప్రస్తావించారు. టీజీపీఎస్సీ లో తలెత్తే చట్టపరమైన సమస్యలకు సంబంధించి న్యాయ నిపుణులు, వివిధ సబ్జెక్టు నిపుణులను సంప్రదించి అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సమన్వయంతో చర్చలు కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశం ఆదివారం కూడా కొనసాగనుంది. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరు, వాటి విధి విధానాలపై చర్చించారు. మెరుగైన ఫలితాలను సాధించడానికి పీఎస్సీలు అమలు చేయాల్సిన విధానాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక ముఖ్యమైన అంశాలు చర్చించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మంచుకొండల్లో పొంచి ఉన్న ముప్పు

టిబెట్ భూభాగంతో ఉన్న టెక్టోనిక్ ప్లేట్లతో సంఘర్షిస్తున్నాయి. ఇప్పటికే, ఏడాదికి 2 మిల్లీ మీటర్ల చొప్పున భారత భూభాగం కూడా తగ్గుతున్నట్లు ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది, రాబోయే కాలంలో మరింత భయానక భూకంపాలకు కారణమవుతుందా..?హిమాలయాలకు భూకంపం టెన్షన్ పట్టుకుంది. చల్లని వాతావరణాన్ని పంచే హిమాలయాల భూగర్భంలో తీవ్రమైన యుద్ధమే జరుగుతుంది. ఖండాలను చీల్చే టెక్టోనిక్ ప్లేట్ల మధ్య ఘర్షణతో.. హిమాలయన్ రీజన్ భయంకరమైన భూకంపాలకు కారణం అవుతోంది. అసలు, ఆ ప్రాంతంలో ఏం జరుగుతోంది..? టెక్టోనిక్ ప్లేట్ల సంఘర్షణతో వచ్చిన టెన్షన్ ఏంటీ..? రీసెంట్‌గా వచ్చిన టిబెట్ భూకంపానికి మించిన డేంజర్ భవిష్యత్తును భయపెడుతోందా..?విశ్వంలోనే అత్యంత అందమైన గ్రహం భూమి అంటారు. భూమిపైన వాతావరణం ఎంత అందంగా ఉంటుందోనని సంబరపడతారు. అయితే, భూమి లోపల ఏం జరుగుతుందో అందరికీ తెలియకపోవచ్చు. ఈ అందం కింద ఎంత విధ్వంస్వం దాగుందో అర్థం కాదు. ఇక, భారతదేశానికి తలమానికైన అద్భుత హిమాలయ ప్రాంతం కింద కూడా ఘోరమైన సంఘర్షణ జరగుతోందని ఎప్పటి నుండో అధ్యయనాలు చెబుతున్నాయి. హిమాలయన్ రీజన్‌లో రెండు భూ ఫలకాల మధ్య భారీ వత్తిడి పెరుగుతోంది. ఇది, భారత్, టిబెట్ దేశాల్లో దేనినైనా చీల్చడానికి అవకాశం ఉంది.ఈ ఏరియాలో రాబోయే తీవ్రమైన భూకంపాలతో ఒక ప్రాంతం సర్వనాశనమయ్యే ప్రమాదమూ ఉందనేది నిపుణుల అభిప్రాయం. ఇదే ఇప్పుడు భారత్‌ను కూడా భయపెడుతోంది. కొన్నేళ్లుగా హిమాలయన్ ప్రాంతంలో టెక్టోనిక్ ప్లేట్ల మధ్య మార్పులు కనిపిస్తున్నాయి. చాప కింద నీరులా.. ఈ ప్రాంత భూభాగం కింద టెక్టోనిక్ ప్లేట్లు జారిపోతూ ఉన్నాయి. టిబెట్, నేపాల్ సరిహద్దుల్లో భారీ భూకంపం సంభవించింది. జనవరి 7న సంభవించిన ఈ భయానక భూకంపంలో 126 మంది ప్రాణాలు కోల్పోగా.. 188 మంది గాయపడ్డారు. 400 వందల కంటే ఎక్కువ మంది భవన శిథిలాల కింద చిక్కుకున్నారు. ఇప్పటికీ ఇక్కడ సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇది ఎంత తీవ్రంగా వచ్చిందంటే.. 24 గంటల్లో దాదాపు 20 సార్లు భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.1గా నమోదైంది. జనవరి 8న సంభవించిన భూకంప తీవ్రంత 6.58గా నమోదయ్యింది.వరుసగా వచ్చిన ప్రకంపనల్లో 10 సార్లు 6 తీవ్రతతో భూకంపం ఏర్పడింది. భూకంపాలకు ప్రసిద్ధి చెందిన టిబెట్ ప్రాంతంలో గత సంవత్సరం 100 భూకంప సంఘటనలు జరగ్గా అవి కనీసం 3.0 తీవ్రతతో వచ్చినట్లు డేటా వెల్లడిస్తోంది. అయితే, 7 తీవ్రతకు మించిన చాలా తక్కువే అయినప్పటికీ.. 20వ శతాబ్ధం ప్రారంభం నుండి ఇప్పటి వరకూ 7 తీవ్రత దాటిన భూకంప సంఘటనలు 9 సార్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక, ఇప్పుడొచ్చిన భూకంప తీవ్రతకు వెయ్యి కంటే ఎక్కువ ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతంలో భారీ జనసాంద్రత ఉండటం వల్ల వందల మంది నిరాశ్రయులుగా మారాల్సి వచ్చింది.ఈ భూకంప ప్రభావం ఒక్క టిబెట్‌ను మాత్రమే కాకుండా నేపాల్, భారత్‌లలో కూడా కనిపించింది. టిబెట్‌లోని డింగ్రీ కౌంటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత అధికంగా ఉంది. ఈ భూకంపం ధాటికి భవనాలు నేలమట్టం అయ్యాయి. టిబెట్ సరిహద్దుని ఆనుకుని ఉన్న నేపాల్‌లోని 7 జిల్లాల్లో భూకంపం ప్రభావం కనిపించింది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలోని లబుచె ప్రాంతంలో ఉదయం 6.30 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం ఆరుసార్లు భూకంపం వచ్చినట్టు చెప్పారు., టిబెట్‌లో విధ్వంసం సృష్టించిన ఈ భూకంప కేంద్రం.. నేపాల్-భూటాన్ సరిహద్దు వైపు ఉన్న ఎవరెస్టు శిఖరానికి కేవలం 80 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. భూకంపానికి కారణమైన కేంద్ర భాగం.. భూ ఉపరితలం నుంచి 10 కి. మీ. లోతులో ఉన్నట్లు భూకంప పరిశీలకులు వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని లాసా రీజియన్ అని పిలుస్తున్నారు. ఇది హిమాలయన్ ప్రాంతంలో భౌగోళికంగా అత్యంత కీలకమైన ప్రదేశంగా ఉంది. ఈ ప్రాంతానికి ఉత్తరం వైపు.. బ్యాంగాంగ్-నుజి యాంగ్ జోన్ ఉండగా.. దక్షిణం వైపు ఇండస్- యార్లింగ్ జాంగ్బో సరిహద్దులు ఉంటాయి.ఇక్కడ భూ ఫలకాల్లో మార్పులు సంభవించినప్పుడల్లా దాని ప్రభావం ఈ ప్రాంతంపై పడుతుంది. అందుకే తరచూ ఇక్కడ భూకంపాలు ఏర్పడుతుంటాయి. గత రికార్డులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసాయి. ఇండియన్, యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య నిత్యం జరుగుతున్న ఘర్షణలు ఈ భూకంపాలకు కారణం అవుతున్నాయి. అయితే, భవిష్యత్‌లో మరింత ప్రమాదకరమైన భూకంపాలు వచ్చే అవకాశమున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.పురాతన ఖండం గోండ్వానాలో ఒక భాగంగా ఉన్న భారత భూభాగం.. 10 కోట్ల సంవత్సరాల క్రితం ఇతర శకలాల నుంచి భారత టెక్టోనిక్ ప్లేట్‌గా విడిపోయింది. ఇది ఉత్తరం వైపు కదులుతూ వచ్చింది. ప్రస్తుతం, భారత ఉపఖండం, దక్షిణ చైనా, పశ్చిమ ఇండోనేషియాలో కొంత భాగం వరకు ఈ ప్లేట్ విస్తరించి ఉంది. ఇది 5 కోట్ల సంవత్సరాల నుంచి యురేషియన్ ప్లేట్‌ను ఢీ కొడుతూ ఉంది. దాని ప్రభావంతోనే హిమాలయ శ్రేణులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం, ఈ టెక్టోనిక్ ప్లేట్.. యురేషియన్ ప్లేట్ వైపు ఏటా 5 సెంటీమీటర్ల మేర కదులుతూ.. దాన్ని ఢీకొంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.గతంలో కూడా హిమాలయాల మధ్య భాగాలైన నేపాల్‌లోని ఖాట్మండు, భారతదేశంలోని డెహ్రా డూన్ మధ్య గతంలో పెద్ద భూకంపం సంభవించిందనీ.. భవిష్యత్తులో అలాంటి మరో భూకంపం వస్తుందని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. అందులోనూ, భారతీయ టెక్టోనిక్ ప్లేట్ హిమాలయాల క్రింద సంవత్సరానికి 1.8 సెంటీమీటర్ల మేర ఒక పెద్ద లోపంతో కదులుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఆసియా వైపు భారతదేశ మొత్తం ప్లేట్ కదలికలో మూడింట ఒక వంతు. అంటే, సంవత్సరానికి 5.4 సెంటీమీటర్లు. ఇక, మిగిలిన ప్లేట్ కదలిక రేటు టిబెట్, మధ్య ఆసియాలోని ఇతర ప్రాంతాల్లో ఉంది. అయితే, ఈ టెక్టోనిక్ ప్లేట్ల కదలిక ప్రభావంతో భవిష్యత్తులో హిమాలయ ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, నేపాల్ వంటి పలు ప్రాంతాల్లో కూడా తీవ్రమైన భూకంప ప్రభావం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.


# లబ్ధిదారుల ఎంపికకు గ్రామాల వారిగా టీములు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 11 (తీన్మార్ న్యూస్): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికకు గ్రామాల వారిగా టీములు ఏర్పాటుతో పాటు, గ్రామ సభల నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికకు గ్రామాల వారిగా టీముల ఏర్పాటు, గ్రామ సభల షెడ్యూల్ తయారు చేయు అంశాలపై రెవెన్యూ, పంచాయతి రాజ్, వ్యవసాయ, డిఆర్డీఓ, పౌర సరఫరాలు, గృహ నిర్మాణశాఖ, మండల ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి లబ్ధిదారులకు ఈ నాలుగు పథకాలు అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. రైతు భరోసా వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ భూముల్లో ఇండ్లు నిర్మాణాలు, గోదాముల నిర్మాణం, రియల్ ఎస్టేట్, నాలా కన్వర్షన్, మైనింగ్ చేయు తదితర భూములకు నిలిపి వేయాలని తెలిపారు. తదుపరి గ్రామ సభలు నిర్వహించి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఆధారంగా కనీసం నెలల్లో 20 రోజులు పని చేసిన వారిని అర్హులుగా తీసుకోవాలని సూచించారు. రేషన్ కార్డులు మండల స్థాయిలో ఎంపిడివోలు, తహసీల్దార్ లు, ప్రజాపాలన దరఖాస్తులు ప్రామాణికంగా తీసుకుని ఇంటి స్థలం ఉన్న పేదలకు, క్షేత్రస్థాయిలో విచారణ టీములు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 16 నుండి 20 వ తేదీ వరకు వివరాలు సేకరించి 24 వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి తుది జాభితా తయారు చేయాలని తెలిపారు. 25, 26 తేదీల వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. 10వ తేదీన రాష్ట్ర. ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లు సమావేశంలో పథకాలు అమలుపై దిశానిర్దేశం చేశారని తెలిపారు. రైతు భరోసా 26 నుండి ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, సాగులో ఉన్న భూమికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి, టైమ్ లైన్ ప్రకారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు విచారణ చేసి నాళాలు, లే అవుట్స్, ఇతరత్రా నిర్మాణాలు జరిగిన భూములు ధరణి నుండి తొలగించాలని గ్రామసభలు నిర్వహించి అర్హుల, అనర్హుల జాభితా తయారు చేయాలని తెలిపారు. వ్యవసాయానికి అనువుగా లేని భూములు అనగా వ్యవసాయానికి పనికి రాని భూములను తొలగించాలని ఆదేశించారు సూచించారు. వ్యవసాయ యోగ్యం లేని భూములను పోర్టల్ నుండి తొలగించాలని, గ్రామ సభలు నిర్వహించాలన్నారు. క్షేత్ర స్థాయిలో 16-20 తేదీ వరకు విచారణకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది తో టీములు ఏర్పాటు చేసి గ్రామసభలు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని, ప్రజలకు సమాచారం తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వెరిఫికేషన్, గ్రామ సభల షెడ్యూల్ తయారు చేయన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో వ్యవసాయ భూమి లేని కుటుంబాలు కనీసం 20 రోజుల పనిదినాలు చేసి ఉండాలని, అట్టి కుటుంబాల వారు మాత్రమే అర్హులన్నారు. ఉపాధిహామీ జాబ్ కార్డు ఉన్న కుటుంబాలను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. 26 నుండి నూతన రేషన్ కార్డులు జారీకి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులు ఆధారంగా విచారణ చేయాలన్నారు. తహసీల్దార్. మండల స్థాయిలో నోడల్ అధికారులుగా ఉంటారని, తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారికి కులగణన జాభితా ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణ, గ్రామసభలు నిర్వహణ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు సర్వే 96 శాతం పూర్తి అయిందని, వాటిలో 5 శాతం సూపర్ చెక్ చేయాలని, అర్హుల జాభితా ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తులు 1.26.లక్షలు న్నాయని తెలియచేస్తూ గ్రీవెన్సు పోర్టల్ లో పిర్యాదు చేయొచ్చని గృహ నిర్మాణ శాఖ పిడి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించాలని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ల అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, డిఆర్డిఓ నరేష్, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, గృహ నిర్మాణశాఖ పిడి లోక్యానాయక్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల జాబితా తయారీ ప్రక్రియ వేగవంత చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**





ములుగు జిల్లా, జనవరి 11 (తీన్మార్ న్యూస్): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు జాబితా తయారీ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాల అమలుపై సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల ప్యూరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతు భరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి, లబ్ధిదారుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడానికి అవసరమైన జాబితాను సిద్ధం చేయాల న్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటా యించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. ప్యూరిఫికేషన్ ప్రక్రియ 16వ తేదీ నుంచి ప్రారంభించి 20వ తేదీ నాటికి పూర్తిచేయా లన్నారు. 16వ నుండి 18వ తేదీ వరకు ఫీల్డ్ పనులు పూర్తి చేసి,19వ తేదీ నాటికి కార్యాలయంలో సమీక్ష జరిపి, తుది జాబితాను 20వ తేదీకి సమర్పించాలన్నారు. 21వ నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేయాలన్నారు. ప్రతి మండలాన్ని రెండు భాగాలుగా విభజించి, ప్రతి భాగానికి డిప్యూటీ తహసీల్దార్‌ను బాధ్యత వహించేలాని యమించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ తో పాటు సీనియర్ అసిస్టెంట్ లేదా జూనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను కూడా ఉంచుకుని డేటాను సక్రమంగా సమీక్షించి, సరైన పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఎంపి ఓలు, ఈ డి ఎం దేవేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత




దేవరకద్ర ప్రతినిధి,జనవరి12(తీన్మార్ న్యూస్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో అశోక్ లైలాండ్ వాహనంలో తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు వాహనం స్వాధీనం చేసుకొని డ్రైవర్ విచరించగా దుప్పల్లి మహేష్ తండ్రి పేరు వెంకటన్న చెప్పడంతో అక్రమ రేషన్ బియ్యాన్ని వెంటనే సివిల్ సప్లై ఆఫీసర్ వేణు కు సమాచారం ఇవ్వగా పంచనామ నిర్వహించి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

# గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**జిల్లా అధ్యక్షులుగా బెల్లంకొండ రామమూర్తి**



సూర్యాపేట, జనవరి 11 (తీన్మార్ న్యూస్): జిల్లా గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీని శనివారం కేంద్రంలోని రాకేష్ డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బెల్లంకొండ రామమూర్తి, గౌరవ అధ్యక్షులుగా కాంపాటి రాధాకృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చిత్తలూరు యాదగిరి గౌడ్, కోశాధికారిగా గుణగంటి వెంకటేశ్వర్లు గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏలుగూరి కిరణ్ గౌడ్, అసోసియేట్ అధ్యక్షులు గా బెల్లంకొండ రామచంద్రం గౌడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పబ్బతి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా సూర్యాపేట జిల్లా లోనే గౌడ ఉద్యోగులు 800 మంది సభ్యత్వం కలిగిన అతి పెద్ద సంస్థ జిల్లా గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం అని తెలిపారు. జిల్లా గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం రిటైర్టు ఉద్యోగులు ఉద్యోగుల సంక్షేమం కొరకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. జనాభా ధమాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని, గౌడ ఉద్యోగుల కొరకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో మద్యం దుకాణాలను గౌడ కులస్తులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.4 డివిజన్ల పరిధిలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా గౌడ ఉద్యోగుల సంఘం నాయకులు సాయిబాబాగౌడ్ వెంకటయ్య గౌడ్, కనకమల్లు గౌడ్, తండు అంజయ్య గౌడ్ ,దేశగాని పాపయ్య గౌడ్, అల్లాడి సత్యనారాయణ గౌడ్, చికూరికృష్ణ గౌడ్, మండవ కృష్ణమూర్తి గౌడ్ సురభి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ శావులం సాయిలు 29వ వర్ధంతి..



రెంజల్ :రెంజల్ మండలం బోర్గం గ్రామంలో శనివారం కామ్రేడ్ శావులం సాయిలు 29వ వర్ధంతి వేడుకలను సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంత నాయకులు ఘనంగా నిర్వహించారు. సాయిలు నీరుపేద ప్రజల కు అండగా నిలిచి సింగూర్, నిజాంసాగర్ నీటి అవసరం కోసం అనేక పోరాటాలను చేసి ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇప్పించారని వారు కొనియాడారు. మల్లెపాడు భూములను నిరుపేదలకు పంచడంలోనూ, వ్యవసాయ విత్తనాలను సబ్సిడీపై ఇప్పించడంలోనూ, నిజాం షుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై పోరాటం చేయడం జరిగిందని వారన్నారు. ఆయన మరణించి 29 సంవత్సరాలు అయినప్పటికీ ఆయన అడుగుజాడల్లో తాము నిరుపేదలకు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంత మాస్ లైన్ జిల్లా నాయకులు పుట్టి నడిపి నాగన్న, ఎస్కే నసీర్, వడ్డెన్న, పెద్దులు, గోపాల్, సిద్ధ పోశెట్టి, తరుణ్, లక్ష్మణ్, సాయిలు, పోశెట్టి, గోరె పాషా తదితరులు పాల్గొన్నారు

# టోల్‌గేట్ల వద్ద రద్దీ లేకుండా పోలీసుల ముందస్తు చర్యలు

హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా నగర ప్రజలు ఒక్క సారిగా పల్లె బాట పట్టడంతో శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అబ్దుల్లాపూర్ మెట్ ఓఆర్ఆర్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అబ్దుల్లాపూర్ మెట్ నుంచి కొత్తగూడెం వరకు నెమ్మదిగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. విజయవాడ జాతీయ రహదారిపైప ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రిస్తున్నారు. విజయవాడ జాతీయ రహదారిలో పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీని తగ్గించేందుకు మరో రెండు మార్గాల ద్వారా వెళ్లాలని పోలీసులు సూచనలు చేస్తున్నారు. అద్దంకి నార్కట్‌పల్లి రహదారికి బదులుగా సాగర్ మీదుగా మాచర్ల రహదారి ఎంచుకోవాలని సూచించారు. ఎల్‌బి నగర్ నుంచి వెళ్లే వాహనాలు బిఎన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మీదుగా సాగర్‌కు దారి ఉంటుందన్నారు. ఓఆర్ఆర్ నుంచి వెళ్లే బొంగులూరు ఎగ్జిట్ నుంచి సాగర్‌కు ప్రత్యామ్నాయ రహదారి, విజయవాడ ప్రధాన రహదారికి ప్రత్యామ్నాయంగా ఘట్‌కేసర్, భువనగిరి, చిట్యాల రహదారి ఎంచుకోవాలని పోలీసులు సూచనలు చేశారు. హైదరాబాద్ నుంచి ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి మీదుగా చిట్యాల వెళ్లాలని సూచిస్తున్నారు. ఒఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్ వద్ద ఎగ్జిట్ అయి భువనగిరి మీదుగా చిట్యాల వెళ్లవచ్చన్నారు. దీంతోపాటు రైల్వేస్టేషన్‌లు, ఎంజిబిఎస్, జేబిఎస్ బస్టాండ్‌లు సైతం ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. రైళ్లలో రిజర్వేషన్‌లు దొరక్కపోవడంతో జనరల్ బోగీల్లోనైనా వెళ్లాలన్న తాపత్రయంతో ప్రయాణికులు భారీగా రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్నారు.

# సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి**



సూర్యాపేట, జనవరి 11 (తీన్మార్ న్యూస్): ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సిపిఎం పార్టీ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈనెల 20 నుండి 24 వరకు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జరిగే ఇంటింటికి సిపిఎం కు ప్రజలంతా సహకరించాలని కోరారు. అనంతరం శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక కార్మిక పోరాటాలకు నిలయమైన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభలో రాష్ట్రంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మిలు, మహిళలు, విద్యార్థులు, యువజనులు, చేతి వృత్తుదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక తీర్మానాలు చేరినట్లు చెప్పారు. ఈ మహాసభ సందర్భంగా జనవరి 25న లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందని ఈ సభకు సిపిఎం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ హాజరవుతున్నారని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో దేశ ప్రజానీకానికి చేసింది ఏమి లేదని 10 సంవత్సరాల బిజెపి పాలన మహిళలకు, దళితులకు, బలహీన వర్గాలకు ముస్లిం మైనార్టీలకు రక్షణ కరువైందని అన్నారు. ఐక్యంగా ఉన్న దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలను బిజెపి రెచ్చగొడుతుందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, రుణమాఫీ నేటికీ పూర్తి కాలేదని, రైతు భరోసా నిధులు విడుదల చేయలేదని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12,000 ఇస్తామని చెప్పిన హామీ అమలు నోచుకోలేదని మండిపడ్డారు . కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు గురించి రాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

# మహనీయులు వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం

**అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో**



మహబూబాబాద్ జిల్లా, జనవరి 11 (తీన్మార్ న్యూస్): మహనీయులు వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా వడ్డే ఓబన్న నిర్వహించిన పాత్ర, ఆయన జీవిత చరిత్రను జిల్లా వెనుకబడి తరగతుల అధికారి చదివి వినిపించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడైన వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఆయన అందించిన స్ఫూర్తిని అందరూ స్మరించుకోవాలన్నారు. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. మహనీయులు చేసిన గొప్ప పనులను స్మరించుకోవడం వల్ల వారు అందించిన స్ఫూర్తి, విలువలు తెలుస్తాయని అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన సహచరుడిగా బ్రిటిష్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. స్వార్థ ప్రయోజనాలతో బ్రతికే సమాజంలో ఆనాటి కాలంలోనే ఆయన నిస్వార్థంగా మంచి విలువలను పాటిస్తూ దేశం కోసం పోరాటం చేశారని అన్నారు. ఓబన్న నిరంతరం కష్టపడే తత్వంతో జీవితాంతం చెడుపై పోరాటం చేస్తూ గడిపారని ఆయన చేసిన సేవలను గుర్తు చేసు కోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి నరసింహస్వామి, జెడ్పీ సీ ఈ ఓ పురుషోత్తం, మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు వడ్డెర సంఘం జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పలువురు బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రార్థన మందిరాల నిర్వాహకులతో ఎస్సై సమావేశం

**- యూనివర్సల్ ఇన్విజిబుల్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి**

**- అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్**





ఆత్మకూర్ జనవరి 11 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రార్థనా మందిరాల నిర్వాహకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో దేవాలయాలు బ్యాంకులో చర్చిలు మసీదులో దొంగతనాలకు కొందరు దుండగులు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రార్థన మందిరాల వద్ద యూనివర్సల్ ఇన్విజిబుల్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని కార్పెంటర్ వెల్డర్ల సహాయంతో దానిని ఎలా వినియోగించాలో వివరించారు అలాగే ప్రతి గ్రామంలో ప్రార్థన మందిరాలు నందు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని వాటి యొక్క ప్రాముఖ్యతను నిర్వాహకులకు ఆయన సూచించారు. ఇట్టి కార్యక్రమంలో అమరచింత పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

**- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య**

**- రజక వృత్తి ఆధునీకరణ,ఉపాధి కల్పన అంశంపై సదస్సు**



ముషీరాబాద్: కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రజక వృత్తి ఆధునీకరణ, ఉపాధి కల్పన అంశంపై రాష్ట్ర సదస్సు రెండో రోజు ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో వృత్తుల ఆధునీకరణ ఉపాధి కల్పనకు డ్రై క్లినిక్ షాపులు ఏర్పాటు చేసుకోవడానికి రూ.10 లక్షల వరకు రుణాలు, పూర్తి సబ్సిడీతో విద్యుత్, రజక ఫెడరేషన్‌కు నిధుల కేటాయింపు, రజక వృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేస్తామన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో సంప్రదాయ వృత్తిదారులకు ఆధునీకతపై శిక్షణ కల్పించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. వృత్తిదారులకు ఉపాధి కల్పించే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అత్యంత వెనుకబాటులో ఉన్న సేవా వృత్తిదారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

చేనేత, గీత కార్మికుల్లాగా ప్రత్యేక పెన్షన్ పథకం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సభ్యులు ఎం.బాలకృష్ణ, మల్లేష్, ఎం.గోపాల్, జ్యోతి ఉపేందర్, పాయిరాల రాములు, కంచర్ల కుమారస్వామి, వెంకటేశ్వర్లు, ఎస్.సుభద్ర, జి.మానస పాల్గొన్నారు.

# స్కూల్ సెలవుల సమయంలో పిల్లలపై ఓ కన్నేసి ఉంచండి

**- ప్రమాదాలను నివారించండి**

**- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్**



ఆత్మకూర్ జనవరి 11 తీన్మార్ న్యూస్:- పాఠశాలకు సెలవులు రావడంతో పిల్లల పట్ల తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలని ఎంత పనిలో ఉన్న సరే పిల్లలపై ఒక కన్నేసి ఉంచాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ సూచించారు పిల్లల పట్ల అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆయన అన్నారు పిల్లలను బావుల్లో చెరువులో ఈత కొట్టేందుకు పంపించొద్దని ఈత నేర్పించాల్సిన అవసరమైతే తామే స్వయంగా వారికి తోడుగా వెళ్లాలని అన్నారు మైనర్లను బైక్ నడపమని చెప్పొద్దు పిల్లలకు బైకు తాళాలు కనిపించకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సెల్ ఫోన్లు ట్యాబులు వారికి ఇవ్వద్దు ఇవ్వాల్సిన అవసరమైతే మీకు కనుచూపుమేలలో ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ప్రత్యేక గదిలో ఒంటరిగా ఉండటం వల్ల అనర్థాలకు దారితీస్తుంది స్నేహితులతో కలిసి దూర ప్రాంతాలకు పంపకండి ఇంట్లో పెద్దలతో పిల్లలు ఎక్కువ సమయం గడిపేలా చూడాలి వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచుకొని తమ సంస్కృతి సంప్రదాయాలు నేర్పించాలని ఖాళీగా ఉండకుండా పిల్లలకు ఆసక్తి గల అంశాలపై డ్యాన్స్ సంగీతం వంటి మొదలగు అవసరమైన శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రుల తమ పిల్లలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

# గేమ్ చేంజర్ సినిమా టికెట్ ధరలను తగ్గించాలి

**రాష్ట్ర ప్రభుత్వం మాట మార్చడం వెనక మతలబు ఏంటి? ఏఐవైఎఫ్**




ఆత్మకూర్ జనవరి 11 తీన్మార్ న్యూస్:- ప్రపంచవ్యాప్తంగా బాలీవుడ్ స్థాయిలో రిలీజ్ అయిన గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేస్తున్నామని, పెంచిన సినిమా టిక్కెట్ల ధరలను తగ్గించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్), జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎండి కుతుబ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినిమా టిక్కెట్ల ధరలను పెంచేది లేదంటూ అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేశారు. కానీ సినీ పరిశ్రమ వారితో భేటి తర్వాత సీఎం మాట తప్పి గేమ్ చేంజర్ సినిమాకు అనుమతి ఇవ్వడం వెనక ఉన్న మతలబేంటని వారు ప్రశ్నించారు. ఎవరి ప్రయోజ నాల కోసం మాట మార్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పూటకో నిర్ణయం తీసుకోవడం సరికాదని హితవు పలికారు. సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటకు కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. సినిమా టిక్కెట్ల ధరలను పెంచొద్దనీ, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. టిక్కెట్ల ధరలను పెంచడంతో ప్రేక్షకులపై భారం పడుతుందనీ, వినోదాన్ని పేదలకు దూరం చేయడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ వైఎఫ్ నాయకులు శేఖర్ మైబు రవి పాల్గొన్నారు.

# వాలీబాల్ పోటీలో మొదటి స్థానం సాధించిన ఆత్మకూర్





**జన మైత్రిక్రీడ ఉత్సవాల్లో భాగంగా**

ఆత్మకూర్ జనవరి 11 తీన్మార్ న్యూస్:-

వనపర్తి జిల్లా కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జన మైత్రి క్రీడా ఉత్సవాలు నిర్వహించారు ఈ క్రీడా ఉత్సవాలు ఆరు రోజుల పాటు ఎంతో ఆహ్లాద వాతావరణంలో క్రికెట్ వాలీబాల్ బ్యాట్మెంటన్ గాలిపతంగులు ముగ్గుల పోటీ మొదలగు క్రీడాలు నిర్వహించారు. ఇట్టి క్రీడలో ఆత్మకూరు పురుషుల జట్టు వాలీబాల్ పోటీలో ఖిలా ఘనపూర్ జట్టుపై మొదటి బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ వాలీబాల్ జట్టుకు ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ వాలీబాల్ జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ పోలీస్ శాఖ సిబ్బంది క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు ఇవ్వాలని ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన..



అచ్చంపేట: జీతాలు ఇవ్వాలని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న మహిళా కార్మికులు శనివారం ఆస్పత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ మల్లేష్ మాట్లాడుతూ.. పారిశుద్ధ మహిళా కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, పండుగకు కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి వచ్చిందన్నారు. అదేవిధంగా మూడు సంవత్సరాలుగా విధుల్లో చేరిన నాటి నుండి పీఎఫ్ నిధులను అకౌంట్లో జమ చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ వస్తున్న కనీసం వేతనాలు ఇవ్వకపోవడంతో ఎలా జరుపుకోవాలని కార్మికులు కాంట్రాక్టర్, ప్రభుత్వంపై ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు చెల్లించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వేతనాలు చెల్లించకపోతే 13.నుండి సమ్మెలోకి చేపడతామని హెచ్చరించారు. ఆస్పత్రి హెడ్ నర్స్ కు సమ్మె పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాములు, సయ్యద్, కార్మికులు కాశమ్మ, చెన్నమ్మ, పద్మ, గాయత్రి, సంధ్య, తిరుపతమ్మ, జయమ్మ, రేణుక ,చిట్టెమ్మ ,తదితరులు ఉన్నారు.

# టీచర్ల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

**- ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య**




హైదరాబాద్: టీచర్ల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం అభ్యర్థి మల్క కొమరయ్య అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ మీడియా ఇన్‌చార్జి ఎన్వీ.సుభాష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తన మీద నమ్మకంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన జాతీయ నాయకత్వానికి, ఎంపికలో సహకరించిన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, డాక్టర్ కె.లక్ష్మణ్, అరవింద్‌కి, ఎమ్మెల్యేలకు, ముఖ్యనాయకులకు, ధన్యవాదాలు తెలిపారు. తాను సొంతూరులో మూడో తరగతి వరకు, అప్పన్నపేటలో పదోతరగతి దాకా, కరీంనగర్‌లో ఇంటర్, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించానని చెప్పారు. 1994 నుంచి తాను విద్యాసంస్థలను నడుపుతున్నాననీ, ఆరువేల మంది టీచర్లు తమ సంస్థల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు టీచర్లకు ఒకే రకమైన సమస్యలుంటాయనీ, 40 ఏండ్లుగా విద్యార్థులను తయారు చేస్తూ, టీచర్ల సమస్యలను పరిష్కరిస్తున్నానని చెప్పారు. ఉత్తమ పౌరులను తయారుచేయడం టీచర్లతోనే సాధ్యమన్నారు.

# బోనస్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

**- రైతన్నల ఎదురుచూపులు**
**- ఆన్‌లైన్‌లో జమ**
**- ఖాతాల్లో జమ కాని బోనస్**




వరంగల్: "సన్నాలకు రూ.76,200 బోనస్ నా ఖాతాలో పడాలే.. ఇప్పటికే చాలా రోజులయింది. దాంతో సివిల్ సప్లరు అధికారులను సంప్రదించిన.. జనవరి 19నే బోనస్ చెల్లించినట్టు ఆన్‌లైన్‌లో చూపించారు. ఎస్‌బీఐ పరకాల శాఖలో విచారణ చేస్తే ఆ నిధులు జమ కాలేదు. ఈ విషయంలో మళ్లీ సివిల్ సప్లరు అధికారులను వివరణ కోరితే.. సర్కార్ నిధులు విడుదల చేస్తే ఖాతాలో జమవుతాయని చెబుతున్నారు" హన్మకొండ జిల్లా పరకాలకు చెందిన రైతు పోరండ్ల సంతోష్ విక్రయించిన సన్నాల బోనస్‌కు సంబంధించిన పరిస్థితి ఇది. ఇలాంటి పరిస్థితి ఉమ్మడి వరంగల్ జిల్లా అంతా ఉందని, కొనుగోలు చేసిన ధాన్యం బోనస్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో సన్నాలకు సర్కార్ ప్రకటించిన క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లింపులో తాత్సారం జరుగుతోంది.

**ఒక్కో జిల్లాలో ఒక్కోలా..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బోనస్ చెల్లింపులు ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా ఉన్నాయి. వరంగల్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో 190 కొనుగోలు కేంద్రాల్లో 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 1.10 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు ఉండగా.. వాటికి బోనస్ కింద రూ.55.05 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు రూ.25.15 కోట్లు మాత్రమే చెల్లించగా.. మరో రూ.29.89 కోట్లు చెల్లించాల్సి ఉంది. హన్మకొండ జిల్లాలో 146 కొనుగోలు కేంద్రాల్లో 89,536 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 60,157 మెట్రిక్ టన్నులు సన్నాలే కావడం గమనార్హం. ఇందుకుగాను 55,022 మెట్రిక్ టన్నులకు చెల్లింపులు ఆన్‌లైన్ చేశారు.

ఇందులో 12,665 మంది రైతులకు రూ.27.51 కోట్లు బోనస్‌గా చెల్లించాల్సి ఉంది. కాగా 9,417 మంది రైతులకు సంబంధించిన 42,862 మెట్రిక్ టన్నుల సన్నాలకు బోనస్‌గా రూ.21.43 కోట్లు చెల్లించారు. 3,248 మంది రైతులకు సంబంధించి మరో 12,160 మెట్రిక్ టన్నులకు బోనస్‌ను రూ.6.08 కోట్లు చెల్లించాల్సి ఉంది.

# సాంస్కృతిక జీవన విధానం రూపకల్పన కావాలి

**- గతి తప్పుతున్న ప్రజల జీవన విధానం : పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**
**- ఆందోళన కలిగిస్తున్న కుల, మత విద్వేషం, అసహనం**
**- రవీంద్రభారతిలో "విధ్వంస జీవన విధానం- సాంస్కృతిక చైతన్యం"పై సదస్సు**



కల్చరల్: కళలు, సాహిత్యం మాత్రమే సంస్కృతి కాదనీ, ప్రజల ఆచార వ్యవహారాలు.. జీవన విధానం అన్నీ కలిపి సమగ్రంగా చూడాలని సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్ర ఏర్పాటులో పాట, ఆట, సాహిత్యం ప్రాముఖ్యత విస్మరించలేమని చెప్పారు. హైదరాబాద్ రవీంద్రభారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ సాంస్కృతిక సారథి, సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీల నిర్వహణలో "విధ్వంస జీవన విధానం- సాంస్కృతిక చైతన్యం" అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు తరువాత సాంస్కృతిక జీవన విధానం రూపకల్పన జరగాలనే లక్ష్యంతో కవులు, కళాకారులు, రచయితలతో సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నేడు తెలంగాణ సమాజం ముందు పలు సంక్షోభాలు, సవాళ్లు ఉన్నాయని తెలిపారు. యువత ఆన్‌లైన్ గేమ్స్‌కు, మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవన విధానం గతి తప్పడం వల్ల నేటి సమాజంలో అనేక రుగ్మతలు, పెడధోరణులు, నిత్యం ఎన్నో ఆకృత్యాలు, సంఘటనలు చోటుకుంటున్నాయని చెప్పారు. ఆహారపు అలవాట్లు మారి అనారోగ్యం బారిన పడుతున్నారని, విద్యా, వైద్యం, ఆడంబరాలకు పోయి స్థాయికి మించి ఖర్చులు చేస్తూ అప్పుల పాలవుతున్నారని తెలిపారు. ప్రజల్లో సామాజిక చైతన్యం తెచ్చేందుకు కవులు, కళాకారులు, రచయితలు సంఘటిత శక్తిగా తెలంగాణ సమాజ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం ప్రభుత్వానికి తోడ్పడాలని కోరారు. ఇందుకు ప్రభుత్వ సాంస్కృతిక సారథులు ప్రతి గ్రామంలో తమ ప్రదర్శనలతో సామాజిక చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు తగు సూచనలు చేయాలన్నారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. కులం, మతం పేరుతో తెలంగాణ సమాజం విచ్ఛిన్నం కాకుండా మానవీయ విలువలుగల సమాజం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. సంగీత నాటక అకాడమీ చైర్మెన్ డాక్టర్ అలేఖ్య మాట్లాడుతూ.. ప్రజలను జాగృతం చేసేందుకు దేవాలయాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సాంస్కృతిక సారథి చైర్మెన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి భిన్నమైనదని చెప్పారు. సమాజ పునర్నిర్మాణం కళా సారథుల బాధ్యత అని అన్నారు.

ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కుల, మత విద్వేషం, అసహనం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కవి సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ.. కళాకారులు 365 రోజులూ ప్రజల్లో తమ ప్రదర్శనలతో భాగస్వామ్యులు కావాలని, ఇందుకు ప్రభుత్వం తగిన వనరులు అందించాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్య నియంత్రణ కోసం ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలని, లేకుంటే సమాజ విధ్వంసం జరుగుతుందని చెప్పారు. జానపద కళాకారులు జయరాజ్ మాస్టర్ జీ, నాట్య గురువు డాక్టర్ పద్మజారెడ్డి, చిత్రకారుడు యక్క యాదగిరి, కళాకృష్ణ రాఘవరాజ్ భట తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కళా సారథులుగా తమని ప్రభుత్వం గుర్తించాలని కొందరు కళాకారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ.. తప్పకుండా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

# కాళేశ్వరం పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**- ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు మహా కుంబాభిషేకం : రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్**
**- మేలో నిర్వహించే సరస్వతీ పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష**



మహదేవపూర్: కాళేశ్వరం పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పుష్కరాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే మహా కుంబాభిషేకానికి అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం వద్ద ఫిబ్రవరిలో మహాకుంబాభిషేకం, మేలో సరస్వతీ పుష్కరాలు ఉన్నందున ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో కాళ్లేశ్వరంలోని ఈఓ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుంబాభిషేకానికి రాజగోపురంపై ఒకేసారి 20మంది వరకు నిల్చోడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. మేలో నిర్వహించే సరస్వతీ పుష్కరాలకు 19 లైన్ డిపార్ట్‌మెంట్‌ల ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి, ఇతర జిల్లాల నుంచి రోజుకు 50వేల మందికిపైగా సందర్శకులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, వన్ వే రూట్ ఏర్పాటు చేసి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ద్వారా అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు, రూరల్ వాటర్ శాఖ ద్వారా సురక్షిత మంచి నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరి నది పరిసరాల్లో మహిళల కోసం కొన్ని శాశ్వత గదులతోపాటు తాత్కాలిక గదులను ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకోవాలని సూచించారు.

అన్ని శాఖలు టీమ్ వర్క్‌తో పని చేయాలని, చేసే విధుల్లో ఒక్కరిపై భారం పడకుండా అందరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. తిరిగి తాను కుంబాభిషేకానికి వస్తానని. అప్పటి వరకు మిగిలిన పనులు పూర్తి కావాలని తెలిపారు. నేషనల్ హైవేపై కుదురుపల్లి బ్రిడ్జి దగ్గర రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశానికి ముందు తన కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయ స్థాయిని పెంచాలని, సహాయ కమిషనర్ హొదా ఇవ్వాలని కమిషనర్‌కు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాజబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, దేవాలయ ఈఓ మారుతి, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రయ్య, జిల్లా అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్ మహాదేవపూర్ సీఐ రామచంద్రరావు, కాళేశ్వరం ఎస్ఐ చక్రపాణి, ఎంపీడీవో కె.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీలకు 30 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడే ఓబన్న ఆశయాలను నెరవేర్చినట్టు..

కంఠేశ్వర్ :వడ్డెర వృత్తిదారులకి గుట్టలపై సొసైటీలకు 30 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడే ఓబన్న ఆశయాలను నెరవేర్చినట్టు అని వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా సలహాదారుడు వల్లపు వెంకటేష్ అన్నారు. ఈ మేరకు శనివారం నిజాంబాద్ నాందేవ్ వాడలో చేతి వృత్తిదారుల సంఘం కార్యాలయం ముందు వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా సలహాదారుడు పల్లపు వెంకటేష్ జెండా ఆవిష్కరించారు. అనంతరం పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ వడ్డెర ఓపన్న 218 వ జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం స్వాగతిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డెర ఓబన్న, సుబ్బమ్మ సుబ్బన్నలకు జన్మించిన ఓబన్న ఆనాడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భూమిశిస్తూ వసూలు చేయకుండా ప్రజలకు అండగా నిలబడిన మహా మేధావి స్వతంత్ర సమరయోధుడు అని అన్నారు తన మిత్రుడు సైరా నరసింహారెడ్డి సా రత్యంలో దేశాన్ని వదిలి బ్రిటిష్ వాళ్ళు వెళ్లిపోవాలని దోపిడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేసిన నర సింహారెడ్డి వడ్డే ఓబన్న లను టార్గెట్ గా చేసి బ్రిటీ సైన్యంతో దాడి చేయించి ఆ దాడిలో వడ్డే ఓబన్న 39 సంవత్సరాలకే తన ప్రాణాలను బలిసిన అంతర సమరయోధుడు అని కొనియాడారు. ప్రాణాలతో పట్టుకున్న నరసింహారెడ్డిని నల్లమల్ల అడవుల్లో రేనాటిలో ఉరి తీసిన నారు అని అన్నారు. ఆయన ఆశయాలను ఇస్తామని కానీ నేటి పాలకులు అణగారిన కులాలను అణచివేస్తూ వస్తున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. రిజర్వేషన్ ప్రకారం స్థానిక సంస్థల్లో కూడా వడ్డెర్ల వాటా రిజర్వేషన్ కల్పించాలని గుట్టలపై క్వారీలపై హక్కు కల్పించాలని



చదువు లేని వారందరికీ చదువుకోవడానికి కి ప్రభుత్వం ఆర్థిక ప్రభుత్వం ఆదుకోవాలని వడ్డెర ఫెడరేషన్ కి 5000 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయాలని అన్నారు. వృత్తి చేస్తున్న వడ్డారులకి కాళ్లు చేతులు విరిగితే ఐదు లక్షలు, చనిపోయినచో 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు వడ్డెర వృత్తిదారులందరికీ ఐదు లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని 50 సంవత్సరాలు నిండిన ప్రతి వడ్డెర వృత్తిదారుడికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని నిజాంబాద్ జిల్లాలో ఉన్న వడ్డెర కోపరేటివ్ సొసైటీ లకి ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు కాంట్రాక్ట్ పనుల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు సహకరించాలని రాబోయే రోజుల్లో వడ్డెర ఉత్తరాల సమస్యలపై సమస్యల పోరాటాల నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఈడ గొట్టి ఒడ్డన్న ఉపాధ్యక్షుడు బండారి ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఏత్తరి చందర్, పల్లప్ ఎంకటి, కొమురు వెంకటి, కంది ఎల్లయ్య, డి గండికోట శీను, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేసిన బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల:'రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను మళ్లీ కోరుతున్నా%ొ% పేదల భూములను కబ్జాలు చేసినోళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించనోళ్లపై ఉక్కుపాదం మోపండి. మీ వెంట నాతోసహా వేల మంది అండగా ఉంటారు. ఈ విషయంలో మీరు ముందుకు పోవాలని కోరుతున్నా" %ొ%రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలు నిర్మించాలంటే, మంచి పనులు చేయాలంటే ప్రభుత్వ స్థలాలు లేకుండా పోయాయని, గత బీఆర్ఎస్ పాలకులు, కేసీఆర్ కుటుంబం ధరణి పేరుతో ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ చేశారని మండిపడ్డారు. అట్లాంటి వారిని ఉపేక్షించొద్దని, బుల్డోజర్లు దించాలని కేంద్ర హొంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన దివ్యాంగులకు ఉప కరణాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్ తోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణ, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేల్పూల స్వరూప తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ఈరోజు సమాజంలో అన్ని అవయవాలు ఉన్న మనమే అనేక సమస్యలకు సతమతమవుతున్నాం. అలా చూస్తే దివ్యాంగుల ఇబ్బందులు వర్ణనాతీతం. కానీ దివ్యాంగుల మనో నిబ్బరం, ధైర్యం గ్రేట్%ొ%మీకు మేం చేయాల్సిందల్లా అండగా ఉండటమేనని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకాల కింద ఈరోజు 69 లక్షల 54 వేల 911 రూపాయల విలువైన 675 పరికరాలను 322 మంది దివ్యాంగులకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కేవలం నాలుగేళ్లలోనే నా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల సంక్షేమం కోసం 100 కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసినం. దివ్యాంగుల, వృద్ధుల ఆశ్రమాలకు కేంద్రం పెద్ద ఎత్తున నిదులు మంజూరు చేస్తోంది. రాబోయే రోజుల్లో రాజకీయాలకు అతీతంగా కలిసి ముందుకు పోవాలని భావిస్తున్నా. దారి తప్పుతున్నోళ్లను దారికి తెచ్చేందుకు యత్నిస్తా. నేను 5 ఏళ్లలో ఎన్నడూ కలెక్టరేట్ కు రాలేదు. ఏ కార్యక్రమంలో పాల్గొనలేదు. ఎందుకంటే గతంలో నన్ను ఏ కార్యక్రమానికి పిలవలేదు. కలెక్టరేట్ కు వెళితే.. వెంటనే బాధ్యులను బదిలీ చేసే వాళ్లు. కలెక్టర్ ఎమ్మెల్యేలారా బీఆర్ఎస్ ప్రభుత్వం కబ్జా చేసిన స్థలాలు, భవనాలన్నీ స్వాధీన పర్చుకోండి. గతంలో ఎకరాలకు ఎకరాలు కబ్జాలు చేసి దోచుకుంటా



మంటూ చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేమని ఆయన అన్నారు.నేను మళ్లీ కోరుతున్నా పేదల భూములను కబ్జాలు చేసినోళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించనోళ్లపై ఉక్కుపాదం మోపండి. మీ వెంట వేల మంది అండగా ఉంటారు. ఎందుకంటే మంచి పనులు చేయాలంటే ప్రభుత్వ స్థలాలు లేకుండా చేశారు. ధరణి పేరుతో భూములన్నీ దోచుకున్నరు. ఒక కుటుంబమే ఎక్కువగా లాభపడ్డది. ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ పరం చేశారు. ఇకపై అట్లా జరగడానికి వీల్లేదు. సిరిసిల్ల జిల్లాలో నవోదయ స్కూల్ త్వరలో మంజూరు కాబోతోంది. ఆ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపినం. గతంలో ప్రసాద్ స్కీం కింద నిధులిస్తాం ప్రతిపాదనలు పంపాలని కోరితే నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మేం ప్రతిపాదనలు పంపిన వెంటనే పంపారు. అతి త్వరలోనే వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతాం.నేను ఎంపీగా, కేంద్ర మంత్రిగా గెలిచానంటే మీరు పెట్టిన భిక్షే. మీరు గెలిపిస్తేనే ఈ స్థాయికి వచ్చిన. కలిసి పనిచేస్తా. కేంద్రం నుండి అవసరమైన నిధులన్నీ తెచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు యత్నిస్తా. నా లక్ష్యం ఒక్కటే. నా పార్లమెంట్ నియోజక వర్గంలో అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగుడికి పరికరాలివ్వాలి. వాళ్లను అన్ని విధాలా ఆదుకోవాలి. మనసులో వారికి ఏ బెంగ లేకుండా రోజువారీ జీవితం గడిచేలా చేయాలన్నదే నా సంకల్పం. అందుకే నా పార్లమెంట్ పరిధిలో పరికరాలు అందకుండా ఇంకా ఎవరైనా దివ్యాంగులు మిగిలి ఉంటే వాళ్ల జాబితా కూడా సిద్ధం చేయండి. వాళ్లందరికీ పరికరాలు అందించే ఏర్పాట్లు చేద్దాం. ఈ జిల్లాలో ఇకపై ఏ ఒక్క దివ్యాంగుడి నోటి నుండి నాకు పరికరం అందలేదనే మాట రావద్దని ఆయన అన్నారు.

# ఏరియా కమిటీ నుంచి ప్రజా ఉద్యమ కెరటంగా

మెదక్: "కార్మిక వర్గం సర్వశక్తులతో బహుముఖ విప్లవకర పోరాటం సాగించకపోతే పెట్టుబడిదారీ వర్గాన్ని ఓడించానికి అవసరమైన సన్నాహాలు చేయజాలవు" అన్న లెనిన్ స్ఫూర్తితో చిన్న ఏరియా కమిటీగా పురుడుపోసుకున్న సీపీఐ(ఎం) బలమైన ప్రజా ఉద్యమ కెరటంగా విస్తరించి ప్రజా పునాదిని పెంచుకుంది. హైదరాబాద్ జిల్లా కమిటీలో అంతర్భాగంగా ఉన్న పటాన్‌చెరు ప్రాంత ఉద్యమం 1995లో ఏరియా కమిటీగా ఏర్పడింది. అనేక ఆటంకాలు, అవరోధాలెదురైనా తట్టుకుని ట్రేడ్‌యూనియన్, విద్యార్థి ఉద్యమంపై కేంద్రీకరిండం ద్వారా ప్రజా క్షేత్రంగా బలమైన రాజకీయ పార్టీగా విస్తరించింది. పారిశ్రామిక వాడల్లో జరిగిన ఎన్నికల్లో ఉద్దండులైన నాయకుల్ని సైతం ఓడించిన ఎర్రజెండా.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజల ఆదరణతో గౌరవప్రదమైన ఓట్లు పొందింది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తరించి ప్రజా పునాదిని పెంచుకుంటూనే సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలకు ఆతిథ్యమిస్తుంది.

భారత కమ్యూనిస్టు పార్టీలో చీలిక ఏర్పడిన తర్వాత పాత మెదక్ జిల్లాలో సీపీఐతోనే ఎక్కువ మంది నాయకులు వెళ్లారు. ఇద్దరు ముగ్గురు మాత్రమే సీపీఐ(ఎం)తో నడిచారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ జిల్లా కమిటీ పరిధిలో ఎంవీ భాస్కర్‌రావు నాయకత్వంలో బీహెచ్‌ఈఎల్, రామచంద్రాపురం ప్రాంతాల్లో బీహెచ్‌ఈఎల్, ఏపీ స్కూటర్ ఫ్యాక్టరీ కేంద్రంగా ఉద్యమాలు నడిపారు. 1984లో ఓంకార్ విచ్ఛిన్నం తర్వాత విక్రంకుమార్ కూడా విచ్ఛిన్నం వెనకాలే వెళ్లారు. ఉన్న కొద్ది మంది నాయకులతోనే 1985 నుంచి 1995 వరకు హైదరాబాద్ జిల్లాలో కొనసాగారు. ట్రేడ్‌యూనియన్ రంగంలో విస్తరించేందుకు కేంద్రీకరించి పనిచేసిన నాయకత్వం పార్టీని విస్తరిస్తూ వచ్చారు. తొలిసారిగా 1995లో పటాన్‌చెరు తాలూకా కమిటీ పేరిట పార్టీ స్వతంత్ర్య కమిటీ ఏర్పడింది.




ట్రేడ్‌యూనియన్‌లో పార్టీ నిర్మాణాన్ని విస్తరిస్తూ ఎదిగిన ఆ పార్టీ 1997లో సంగారెడ్డిలో సీపీఐ(ఎం) తొలి జిల్లా మహాసభలు జరుపుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అప్పటి 46 మండలాల్లోనూ పార్టీని విస్తరింప చేస్తూ శాఖల్ని ఏర్పాటు చేసుకుంది. గ్రామ, పట్టణ, మండల, జిల్లా కమిటీలతో పాటు ఆయా రంగాల్లో పార్టీ శ్రేణుల్ని తయారు చేసుకుంటూ వచ్చింది. ఎర్రజెండా అంటే సీపీఐ(ఎం).. సీపీఐ(ఎం) అంటే ఎర్రజెండా.. అన్నట్టుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో తన ప్రస్తానాన్ని కొనసాగిస్తుంది. కార్మికులు, కర్షకులు, రైతులు, కూలీలు, వృత్తిదారులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు ఇలా సకల జనుల కష్టసుఖాలను తెలుసుకుంటూ సమస్య ఏదైనా స్పందించే స్థాయికి వచ్చింది. స్పందించడమే కాదు.. బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఫలితాలను కూడా సాధించి పెట్టిందనడంలో అతిశయోక్తిలేదు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా కేవల్ కిషన్ భవన్‌కు వెళ్లాలన్న బలమైన అభిప్రాయం సామాన్యుల్లోనే కాదు మధ్య తరగతి ప్రజల్లోనూ వినపడుతుంది.

# సైబర్ నేరాలకు చెక్...

హైదరాబాద్: హలో.. మీ అకౌంట్ క్లోజ్ అవుతోంది. మీ సిమ్ కు ఇక ఫోన్లు రావు. త్వరగా ఓటిపి చెప్పండి. ఈ తరహాలో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాల ఆట కట్టించారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. ఒకేసారి 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులకు, దిమ్మ తిరిగే షాక్ తగిలింది. 23 మంది సైబర్ నేరగాళ్లలో ఒక మహిళ ఉండగా, ఆ మహిళ ఢిల్లీలో ఎన్జీవో ను నిర్వహించడం విశేషం. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు సైబర్ నేరాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆ ఫిర్యాదులను ఛాలెంజ్ గా తీసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ కవిత.. ప్రత్యేక టీం ద్వారా సైబర్ నేరగాళ్ల ఆట కట్టించారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాక, దేశవ్యాప్తంగా నిందితులుగా ఉన్న 23 మందిని తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేయడం గమనార్హం. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న సైబర్ చీటర్లను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 23 మంది నేరగాళ్ల ను అరెస్టు చేసిన పోలీసులు, వీరు రూ. 5.29 కోట్ల మేర మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. తెలంగాణలో 30 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా, ఈ నేరస్థులపై దేశవ్యాప్తంగా 328 కేసులు నమోదై ఉండడం విశేషం. వీరి అరెస్ట్ పై సైబర్ క్రైమ్ డీసీపీ కవిత మాట్లాడుతూ.. మొత్తం ఐదు ప్రత్యేక బృందాలు గాలించి, నేరగాలను అరెస్టు చేసినట్లు, ఐదు రాష్ట్రాల్లో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. అయితే అనుమానాస్పద లావాదేవీల విషయంలో 70 ఏళ్ల వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. ఈ కేసులో ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. సదరు మహిళ ఢిల్లీలో ఎన్జీవో ను నడుపుతుండగా, డబ్బులకు ఆశపడి సదరు ఎన్జీవో ఖాతాను సైబర్ నేరగాళ్లకు ఆమె అప్పగించడం విశేషం. సైబర్ నారగాళ్లు చోరీ చేసిన నగదును ఆ ఖాతాలో బదిలీ చేయించుకుని నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్జీవో ఖాతాను సైబర్ నేరగాళ్లకు అప్పగించినందుకు సదరు మహిళలు కూడా అరెస్టు చేశామని డీసీపీ తెలిపారు. న్యాయస్థానం ముందు మహిళను హాజరు పరిచిన సమయంలో ఆమె కోసము పది మంది లాయర్లు వాదించారని, డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ కోరారు.

# దల్లేవాల్‌కు మద్దతుగా సీపీఐ(ఎం) ప్రదర్శన

## - ప్రపంచ బ్యాంకు విధానాలు అనుసరిస్తోన్న మోడీ ప్రభుత్వం
## - రైతన్నను కాపాడేందుకు చర్యలు శూన్యం
## - ఆయనకు ఏమైనా జరిగితే బీజేపీనే బాధ్యత వహించాలి : సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




ఖమ్మం: రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ సరిహద్దులోని ఖనేరీలో 46 రోజుల నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం నేత జగ్జత్ సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా శుక్రవారం ఖమ్మంలోని సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్ నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచ బ్యాంకు విధానాలు, కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఫలితంగా భారత్ దేశం వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందటం లేదని విమర్శించారు. అంబానీ, అదానీ కోసం బడా ప్రపంచ పారిశ్రామికవేత్తల కోసం మోడీ 24 గంటలు పని చేస్తున్నారని చెప్పారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కాపాడటానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, ఈ దేశంలో రైతులు ఆత్మహత్య చేసుకొనే విధంగా మోడీ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. దేశంలో ఉన్న రైతులు బాగుపడాలని నిరవధిక దీక్ష చేస్తున్న రైతు సంఘం నేత జగ్జత్ సింగ్‌కు ఏమైనా జరిగితే మోడీ బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై .విక్రమ్, వైరా డివిజన్ కార్యదర్శి భుక్యా వీరభద్రం, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని పార్టీలు బల్దియాపై గురి...

హైదరాబాద్: హైదరాబాద్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పటి నుంచే ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్ మేయర్ పీఠం కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని సీట్లన్నీ గెలుచుకున్న బీఆర్ఎస్.. అదే సత్తా చూపించి ఉఊఓఅ ఎన్నికల్లో కూడా పైచేయి సాధించాలని ప్లాన్ చేస్తోంది. అర్బన్ ఏరియాల్లో పట్టున్న బీజేపీ ఈసారి బల్దియా ఎన్నికలపై పెద్ద కసరత్తే చేస్తోంది. ఇక పాత పట్నంలో బలంగా ఉన్న ఎంఐఎం మేయర్ పీఠం విషయంలో కింగ్ మేకర్‌గా ఉండేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌పై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి..గ్రేటర్ హైదరాబాద్‌లో పొలిటికల్ వ్యవహారాలను తన కంట్రోల్‌లోకి తెచ్చుకునేందుకు వ్యూహాలు రచిస్తూనే ఉన్నారు. హస్తం పార్టీ హైదరాబాద్‌లో బలహీనంగా ఉండటంతో..గ్రేటర్ పరిధిలోని కొంతమంది నేతల చేరికలతో బలోపేతం చేసే ప్రయత్నం చేశారు. ఉఊఓఅ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే హస్తం గూటికి చేరారు. మేయర్ పీఠాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్. బడ్జెట్‌లో ప్రత్యేకంగా 10 వేల కోట్లు కేటాయించి..మూసీ సుందరీకరణ వంటి అంశాలతో ముందుకు వెళ్తున్నారు. మరోవైపు పొలిటికల్‌గా కూడా..ఆచితూచి వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం సపోర్ట్ లేనిదే వర్కౌట్ అయ్యే పనికాదనే ఆలోచనతో..వారితో సఖ్యతగా ఉంటున్నారు. ఎంఐఎంతో కలుపుకొని వెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పార్టీ క్యాడర్‌ను కూడా అప్రమత్తం చేసే దిశగా..పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వరుస సమీక్షలు చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం 150 డివిజన్లకు గాను..40 డివిజన్లకుపైగా ఓల్డ్ సిటీలోనే ఉంటాయి. ఇవన్నీ కూడా ఎంఐఎంకు కంచుకోటగా ఉంటాయి. మ్యాజిక్ ఫిగర్ 75ను అందుకోవాలంటే కాస్త కష్టమయ్యే పనే. అందుకే అవసరమైతే ఎన్నికల ఫలితాల తర్వాత ఎంఐఎంతో కలిసి అయినా సరే మేయర్ పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్ గట్టి కసరత్తు చేస్తుంది. ఇక రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ కూడా వ్యూహ ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యే స్థానాలన్నింటినీ బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో నగర ఓటర్లు కచ్చితంగా తమవైపే ఉంటారని ఆశలు పెట్టుకుంటుంది. ఒకవేళ మేయర్ పీఠం దక్కకపోయినా.. కింగ్ మేకర్‌గా ఉండాలని ఆలోచనలో బీఆర్ఎస్ ఉంది. ఇక మరో ప్రధాన పార్టీ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ పీఠంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. గత ఎన్నికల్లో చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించిన కమలం పార్టీ..ఈసారి మరింత గట్టిగా పనిచేసి..గతంలో కంటే ఎక్కువ సీట్లు సాధించాలని చూస్తోంది. ఉఊఓఅ ఎన్నికల్లో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ సీట్లు రాకపోతే..మేయర్ పీఠం విషయంలో హంగ్ తప్పనిసరి. అప్పుడు కాంగ్రెస్, ఎంఐఎం ఒకటైతే.. అనివార్యమైతే బీఆర్ఎస్, బీజేపీ చేతులు కలిపే అవకాశం లేకపోలేదనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జరుగుతోంది. ఎన్నికల తర్వాత వచ్చే సీట్లను బట్టి పొలిటికల్ పార్టీల స్టాండ్ మారే అవకాశం ఉంది.

ఇప్పటికైతే కాంగ్రెస్, ఎంఐఎం ఒకే దారిలో నడుస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎడమొహం, పెడమొ హంగా ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు ఉఊఓఅ ఎన్నికల ఫలితాల తర్వాత హంగ్ వస్తే మాత్రం..మేయర్ పీఠం కోసం ఒకటి కాక తప్పదన్న చర్చ జరుగుతోంది. చూడాలి మరి మేయర్ పీఠం దక్కించుకునే విషయంలో ఏ పార్టీ అప్పర్ హ్యాండ్ సాధిస్తుందనేది.

# పంచాయితీల నుంచి ట్రాక్టర్లు జప్తు

అదిలాబాద్: పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కోనుగోలు చేసిన చెత్త సేకరణ ట్రాక్టర్ల బకాయిల పంచాయితీ ముదిరింది. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా ట్రాక్టర్ల కొనుగోలుకు సంబంధించి కిస్తీలు చెల్లించకపోవడంతో టాక్టర్లను జప్తు చేస్తామంటూ షోరూం యజమానులు పంచాయతీల కార్యదర్శులకు నోటీసులు జారీ చేస్తున్నారు. నిర్మల్ జిల్లా అధికారుల్లో కలవరం సృష్టిస్తున్నది. లీడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు ఇప్పటికే కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో షోరూంల యజమానులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఆరు నెలల నుంచి సంప్రదింపులకే పరిమితమవుతున్నారని బకాయిలు చెల్లించడం లేదని యజమానులు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని 2021–22 సంవత్సరంలో ప్రభుత్వ గ్యారంటీ కింద టాక్టర్లు మంజూరు చేసింది. జీరో అడ్వాన్స్ కింద ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కొనాలని అప్పట్లో ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. జిల్లా మొత్తం 396 గ్రామ పంచాయతీలు ఉండగా 396 ట్రాక్టర్లను లీడ్ బ్యాంక్ అధికారుల ప్రోత్సాహంతో కిస్తీల రూపంలో చెల్లిం చే విధంగా టాక్టర్లు కొన్నారు. కొన్ని నెలల వరకు కిస్తీలు చెల్లించినా.. ఆ తర్వాత ఎన్నికలు రావడం, బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అంతా తలకిందులైంది. ప్రత్యేక అధికారులపాలన కొనసాగుతుండటం, ప్రభుత్వాలు ప్రతి నెల విడుదల చేయాల్సిన నిధులు విడుదల చేయకపో వడంతో కిస్తీల చెల్లింపు నిలిచి పోయాయి. నిర్మల్ జిల్లాలో 92 పంచాయ తీల్లో ట్రాక్టర్ల కిస్తీల బకాయిలు పేరుకుపో యాయి. మొత్తం రూ. 65 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ బకాయి ఏడాది క్రితమే చెల్లించా ల్సి ఉండగా నిధులు లేమితో చెల్లించకపోవడం తో వడ్డీ వేయడంతో మరింత భారం పడుతున్నది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆలోపే బకాయిలు చెల్లించాలని బ్యాంకర్లు, షోరూ ం యజమానులు ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాలో ట్రాక్టర్ల కిస్తీలు బకాయిలు ఉన్న మాట నిజమే. నిధుల కొరత కారణంగా చెల్లింపులో ఆలస్యమవుతున్నది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న పంచాయతీల కిస్తీలు చెల్లించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సర్దుబాటు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే మిగిలిన బకాయిలు చెల్లిస్తాం. నిర్మల్ జిల్లాలో బ్యాంకు గ్యారంటీ కింద అధికారుల ఆదేశాల మేరకు వివిధ వివిధ బ్యాంకుల ద్వారా 396 పంచాయతీలకు టాక్టర్ రుణాలు ఇచ్చాం. ఇప్పటికి జిల్లాలో 92 టాక్టర్ల కిస్తీలు రూ. 65 లక్షలు బకాయి ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక బకాయిలు చెల్లించడంలేదు. ఉన్నతాధికా రుల నుంచి బాకాయిల చెల్లింపుల కోసం ఒత్తిడి తేవడంతో ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. బాకాయిలు చెల్లిస్తామని చెపుతున్నారుగానీ చెల్లించడంలేదు. కిస్తీలు కట్టకుంటే షోరూం యజమానులు ట్రాక్టర్లను తీసుకెళ్తామంటున్నారు.

# సీలింగ్ విధిస్తారా..? లేదా..?

ఖమ్మం: తెలంగాణలో రైతు భరోసా స్కీమ్ పట్టాలెక్కనుంది. ఈ మేరకు తెలంగాణ సర్కార్ ఇటీవలనే కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. స్కీమ్ అమలుకు సంబంధించి మంత్రివర్గం కూడా ఆమోదముద్ర వేసింది. జనవరి 26వ తేదీ నుంచి ఈ స్కీమ్ ను అమలు చేయాలని నిర్ణయించింది. ఏటా రూ. 12 వేల పంట పెట్టుబడి సాయం అందించబోతుంది. రైతు భరోసా స్కీమ్ ను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. అయితే పథకం అమలులో సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోబోతుందనేది ఆసక్తికరంగా మారింది. గతంలో ఉన్న రైతుబంధు పథకం అమలులో అనేక లోపాలు ఉన్నాయని.. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతూ వస్తోంది. గతంలో మాదిరిగా స్కీమ్ అమలు ఉండదని? సాగు యోగ్యత ఉన్న భూములకే రైతు భరోసా ఇస్తామని కూడా క్లారిటీ ఇచ్చింది. స్కీమ్ అమలుపై ప్రాథమికంగా కొన్ని సందేహాలు తెరపైకి వస్తున్నాయి. ఇందులో సీలింగ్ అంశం కూడా ఒకటిగా ఉంది. గతంలో అమలు చేసిన రైతుబంధు పథకం కింద ఒక రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నా.. పంట పెట్టుబడి సాయం అందించారు. ఎలాంటి సీలింగ్ ను కూడా నిర్ణయించలేదు. దీంతో రైతుకు ఎంత విస్తీరణంలో భూమి ఉందో.. అంతమేరకు పంట సాయం అందింది. అయితే దీనిపై అనేక వర్గాల నుంచి పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం అమలు చేయబోతే రైతు భరోసా పథకంలో సీలింగ్ ఉంటుందా..? ఉండదా..? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. నిజానికి కేబినెట్ సబ్ కమిటీ.. జిల్లా వారీగా రైతుల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించింది. అసెంబ్లీలో నిర్వహించిన చర్చలో కూడా పలు సూచనలు, సలహాలు వచ్చాయి. దీనిపై కేబినెట్ భేటీలో కూడా చర్చ జరిగింది. అయితే ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలను వెల్లడించారు. సాగు యోగ్యత ఉన్న భూములకు ఎలాంటి షరతు లేకుండా పంట పెట్టుబడి సాయం అందిస్తామని స్పష్టంగా చెప్పారు. అంటే? సీలింగ్ లేకుండానే ఈ స్కీమ్ ను అమలు చేస్తారా..? అన్న చర్చ కూడా తెరపైకి వస్తోంది. ఇక తాజాగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం వనపర్తి జిల్లాలో పర్యటించిన ఆయన? రైతు భరోసా పథకం గురించి మాట్లాడారు. జనవరి 26 నుంచి అన్నదాతల అకౌంట్లలో ఎకరానికి 12 వేల రూపాయల డబ్బులను జమ చేస్తామని చెప్పారు. సాగు చేసే ప్రతీ ఎకరానికి రైతు భరోసా ఇస్తామంటూ క్లారిటీ ఇచ్చారు. “ఐదు ఎకరాలో, పది ఎకరాలో కాదు ఎలాంటి షరతులు లేకుండా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికి కూడా రైతు భరోసా అందుతుంది. జనవరి 26 నుంచి స్కీమ్ అమలు చేయబోతున్నాం. రూ. 8400 కోట్లు రైతుల అకౌంట్ల లోకి వెయ్యబోతున్నాం. ఇదే విషయాన్ని రైతులకు ధైర్యంగా చెప్పండి” అంటూ భట్టి ప్రకటన చేశారు. డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన చూస్తే? సీలింగ్ విధానం ఉండదేమోనన్న చర్చ మొదలైంది. అయితే రేపోమాపో రైతు భరోసా స్కీమ్ అమలు కోసం మార్గదర్శకాలు విడుదలయ్యే అవకాశం ఉంది. దీంట్లో సీలింగ్ విధించే అంశంపై ప్రస్తావించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా?. మరికొన్ని అంశాలపై కూడా స్పష్టత వస్తుంది.

# స్థానిక సంస్థలపై కాంగ్రెస్ ఫోకస్

హైదరాబాద్: తెలంగాణలో త్వరలోనే స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. గతేడాదిలోనే జరుగుతాయని అంతా భావించినప్పటికీ?. వాయిదా పడుతూ వస్తున్నాయి. ప్రస్తుతం పల్లెల్లో, వార్డుల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సాధ్యమైనంత త్వరగా స్థానిక ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. సర్కార్ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే? వెంటనే షెడ్యూల్ ప్రకటించేందుకు ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది. స్థానిక ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో అధికార కాంగ్రెస్ వ్యూహాలకు పదునుపెట్టే పనిలో పడింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది. క్షేత్రస్థాయిలో ఉన్న నేతలు కూడా?. పార్టీ గెలుపు కోసం కృషి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హస్తం జెండా ఎగరవేయటమే లక్ష్యంగా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పావులు కదిపేస్తున్నారు. షెడ్యూల్ వచ్చే నాటికే గ్రౌండ్ క్లియర్ గా ఉండాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. నిజానికి ఏడాదిలోపే స్థానిక ఎన్నికలకు కూడా వెళ్లాలని భావించింది. అయితే క్షేత్రస్థాయిలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ.. అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే? గతేడాది కాకుండా ఈ ఏడాదిలోనే ఎన్నికలకు వెళ్లాలని డిసైడ్ అయింది. తాజాగా గాంధీ భవన్ లో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ అయింది. ఇందులో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ జరిగింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీపై చర్చించారు. స్థానిక ఎన్నికలకు వెళ్లే క్రమంలో కాంగ్రెస్ పార్టీ కొన్ని అంశాలను ప్రధాన అస్త్రాలుగా భావిస్తోంది. ఇందులో రుణమాఫీతో పాటు రైతు భరోసా వంటివి ఉన్నాయి. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేశామనే విషయాన్ని ప్రస్తావిస్తూ.. జనాల్లోకి వెళ్లనుంది. అంతేకాకుండా రైతు భరోసాతో పాటు రైతు కూలీలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తున్నామని చెప్పనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను పట్టాలెక్కించే విషయాన్ని హస్తం పార్టీ జనాల్లోకి తీసుకెళ్లనుంది. వీటికితోడు ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ ను మరో అస్త్రంగా భావిస్తోంది. ఫ్రీ బస్సు పథకం, ఉచిత విద్యుత్ తో పాటు ఈ ఏడాది కాలంలో సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని యోచిస్తోంది. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లోసత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది. పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో? క్షేత్రస్థాయిలో పార్టీకి గత వైభవం తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఇటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. అంతేకాకుండా ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు చాలా మంది హస్తం గూటికి చేరారు. ఈ పరిణామాలన్నింటిని అనుకూలంగా మలుచుకోవం ద్వారా? గ్రామ, మండల, జిల్లా పరిషత్ పీఠాలపై హస్తం జెండా ఎగరవేయాలని బలంగా భావిస్తోంది.

# మినీ ఎయిర్ పోర్టుగా మల్కాజ్ గిరి

హైదరాబాద్: పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేలా జంట నగరాల పరిధిలోని రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. ఇప్పటికే చర్లపల్లి టెర్మినల్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి.. ప్రారంభించారు. ప్రస్తుతం సంక్రాంతి ప్రత్యేక రైళ్లు నడిపిస్తుండగా.. మార్చి నుంచి రెగ్యులర్ రైళ్లు ఈ స్టేషన్ నుంచే బయలుదేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా, సికింద్రాబాద్‌కు సమీపంలో ఉన్న మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం (ఏబీఎస్ఎస్) కింద అభివృద్ధి చేస్తున్నారు. సకల వసతులతో దీని రూపురేఖలు మార్చేస్తున్నారు. సికింద్రాబాద్ స్కీంలో భాగంగా ఈ స్టేషన్‌ను ఎంపిక చేశారు. అభివృద్ధి పనుల చకచక జరుగుతున్నాయి. ఇప్పటికే 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మూడు లిఫ్టులు, మూడు ఎస్కలేటర్లు పనులు చేపట్టారు. ఇండ్వెల్ కాంట్రాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతు న్నాయి. స్టేషన్‌లో హై–లెవల్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. వీఐపీ లాంజ్, ఏసీ వేయిటింగ్ హాల్, విశాలమైన పార్కింగ్ వసతి, రైల్వేస్టేషన్ రాకపోకలు సాగించేందుకు కొత్తగా అప్రోచ్‌రోడ్డు, స్టేషన్‌కు ఇరువైపులా ఆకర్షనీయంగా పోర్టికోల నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయిగ్రీనరీతో కూడిన గార్డెన్లతో పాటు ‘ఐ లవ్ యూ మల్కాజిగిరి’ అనే సెల్ఫీ పాయింట్‌ను సైతం స్టేషన్ ముందు నిర్మాణం జరుగుతోంది. గత అక్టోబరు మొదలైన పనులు పూర్తయిన తర్వాత మల్కాజిగిరి రైల్వేస్టేషన్ రూపురేఖలు మారిపోనున్నాయి. ఈ స్టేషన్ మినీ ఏయిర్‌పోర్టుగా ప్రయాణికుల మన్ననలు పొందనుంది. ఇప్పటికే మహబూబ్‌నగర్– విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వంటి కొన్ని రైళ్లకు అక్కడ స్టాప్ ఉంది. వీటితో పాటు మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం స్టాప్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మల్కాజిగిరి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల కోసం కేంద్రం బడ్జెట్‌లో రూ. 27 కోట్లు కేటాయించినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రెండు ఫ్లాట్‌పామ్‌ల మాత్రమే ఉండగా.. ప్రయాణికుల రద్దీని బట్టి మరొకటి అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు.

రోజూ ఈ మార్గంలో 62 రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా... స్టేషన్‌లో 600 సాధారణ టిక్కెటుదారులు, 500 వరకు రిజర్వేషన్ ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి ప్రయాణిస్తున్నారు

# సకల సమస్యలకు,చదువే సర్వరోగ నివారిణి

## --మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్
## ---ఎల్లవేళలా మీకు అందుబాటులో పోలీస్ శాఖ
## ---రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ
## ---హాజరైన ఆదివాసి గ్రామాల ప్రజానికం




తాండూర్: మనకు నిత్య జీవితంలో ఎదురయ్యే సకల సమస్యలకు చదువే సర్వరోగ నివారిణి అని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. ఈ మేరకు తాండూరు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వారి వారి వ్యాపారాలు చూసుకుంటూనే ఆదివాసి గ్రామాల ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో ముందుకు వచ్చిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ వారిని అభినందించారు. ప్రభుత్వం అన్ని విధాల సౌకర్యాలు కల్పించినప్పటికీ మన పిల్లలను చదువుకు దూరంగా ఉంచడం సరికాదని ఆయన గ్రామ ప్రజలకు సూచించారు. ఈ దేశ మూలవాసులు ఆదివాసులేనని ఆయన స్పష్టం చేశారు. ఆదివాసీలకు ఉన్న చరిత్ర ఎంతో చారిత్రాత్మకమైనదన్నారు. మన ఆదివాసి గూడాల నుండి చైతన్యవంతుడైన కొమరం బీమ్ ను ఆదర్శంగా తీసుకొని మన పిల్లలను ఎదగనివ్వాలన్నారు. పదవ తరగతి నుండి పై చదువులకు కూడా వసతిగృహాలు అందుబాటులో ఉన్నాయి కనుక ఉద్యోగం వచ్చేవరకు వారిని చదవమని ప్రోత్సహించాలన్నారు. ఒక గ్రామంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉంటే ఆ ప్రభావం ఆ గ్రామం పైన కాకుండా చుట్టుపక్కల గ్రామాల పైన కూడా పడుతుందన్నారు. ఇన్ని గ్రామాల్లో కేవలం ఇద్దరే ఇద్దరు ప్రభుత్వ సర్వెంట్లు ఉండడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఈ గ్రామాల నుండి ప్రభుత్వ ఉద్యోగులు రావాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇక్కడి ఎస్ఐ , సిఐలు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ గ్రామాల్లో చదువులో రాణిస్తున్న విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని ఆయన సూచించారు. అంతకుముందు ఆదివాసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ వారు పంపిణీ కోసం తెచ్చిన దుప్పట్లను, తదితర సామాగ్రిని ఆదివాసి గ్రామాల ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవి కుమార్, తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, ఎస్సై లు సౌజన్య, కిరణ్ కుమార్, అదనపు ఎస్సై షేక్ హుస్సేన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల బ్లడ్ బ్యాంకు ఇంచార్జి సురభి శరత్ కుమార్, లక్ష్మణ్, సంతోష్, మాజీ ఎంపీటీసి సూరం రవీందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పుడు తెరపైకి ల్యాండ్ క్రూయిజర్

హైదరాబాద్: రాజకీయాలు వెనుకటి కాలంలో ఎన్నికల సమయంలోనే సందడిగా ఉండేవి. ఆ తర్వాత చప్పగా సాగిపోయేది. అరుదైన సందర్భంగా మాత్రమే సంచలనాలు చోటు చేసుకునేవి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రతిరోజు సంచలనమే నమోదవుతుంది. రాజకీయ నాయకులు వ్యక్తిగత కక్ష్యలను దృష్టిలో పెట్టుకొని అడుగులు వేస్తుండడంతో సరికొత్త పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం రాజకీయాలు రోజుకో తీరుగా మారిపోతున్నాయి. మొన్నటిదాకా అల్లు అర్జున్ వివాదం సంచలనం సృష్టించగా.. ఇప్పుడు "ఫార్ములా ఈ" కేసు కలకలం రేపుతోంది. పురపాలక శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నప్పుడు 55 కోట్ల ప్రభుత్వ ఖజానా నుంచి విదేశీ కంపెనీకి బదలాయించడాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుపడుతోంది. ఈ విషయాన్ని క్యాబినెట్లో కూడా చర్చించలేదు. నేరుగా డబ్బును విదేశీ కంపెనీకి పంపించారు. దీనివల్ల కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈ కేసులోకి ప్రవేశించాయి. మొత్తంగా ఏసీబీ, ఈడి రంగంలోకి దిగాయి. ఫలితంగా ఈ కేసు కొత్త మలుపులు తీసుకుంటున్నది. పైగా హైకోర్టు కూడా ఈ కేసు విచారణలో తాము ఏమీ చేయలేమని.. దర్యాప్తు సంస్థలు విచారణ చేపడితే అడ్డుకోబోమని స్పష్టం చేసింది. మొత్తంగా చూస్తే ఈ వ్యవహారంలో కేటీఆర్ ను మరింత లోతుగా కార్నర్ చేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. రేవంత్ రెడ్డి ఒకప్పుడు కేసీఆర్ బాధితుడు కాబట్టి.. నాడు తన కూతురు పెళ్లికి ఒక్కరోజు మాత్రమే అనుమతి ఇచ్చారు కాబట్టి.. పగ తీర్చుకోవడానికి ఇదే సరైన సమయం అని భావిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య ఉప్పు నిప్పులాగా వ్యవహారం సాగుతోంది. అయితే ఇంతలోనే ల్యాండ్ క్రూయిజర్ ఇందులోకి ప్రవేశించింది. అయితే దీనికి దానికి సంబంధం ఏంటి అని అనుకుంటున్నారా.. ఆగండి ఆగండి అక్కడిదాకే వస్తున్నాం.. ముందే మనం చెప్పుకున్నాం కదా రాజకీయాలు ఒకప్పటిలాగా లేవని.. ఫార్ములా ఈ కేసులో కేటీఆర్ ను అడ్డంగా బుక్ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్నర్ చేయడానికి భారత రాష్ట్ర సమితి కూడా తన వంతు ప్రయత్నాలను మొదలుపెట్టింది.భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా విభాగాన్ని పర్యవేక్షించే డాక్టర్ మన్నె క్రిషాంక్ సంచలన విషయాన్ని వెలుగులోకి తెచ్చారు.. కొడంగల్ లో పలు కాంట్రాక్టులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కే ఎల్ ఎస్ ఆర్ అనే కంపెనీకి కట్టబెట్టిందని.. దానికి ప్రతిగా ఆ కంపెనీ ల్యాండ్ క్రూయిజర్ వాహనాన్ని ముఖ్యమంత్రికి అందించిందని ఆరోపించారు. ఆ వాహనం నెంబర్ కూడా యూ 07 ఈఈ 009 అని క్రిషాంక్ పేర్కొన్నారు. కే ఎల్ ఎస్ ఆర్ అనే కంపెనీ 168 కోట్ల కాంట్రాక్టులను పొందిందని క్రిషాంక్ ఆరోపించారు. ఇది క్విడ్ ప్రో కో కు బలమైన ఉదాహరణ అని ఆయన ఆరోపించారు. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీ కూడా స్పందించింది. ఆ వాహనం ఏదో కాంట్రాక్ట్ కంపెనీ బహుమతిగా ఇచ్చింది కాదని.. ముఖ్యమంత్రి సోదరులు గతంలోని కొనుగోలు చేశారని వివరించింది. దానికి సంబంధించి రవాణా శాఖ జారీ చేసిన ధ్రువపత్రాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అయితే ఫార్ములా ఈ కేసులో రోజుకో తీరుగా సంచలనాలు నమోదు అవుతుండగా.. ఇప్పుడు కొత్తగా ఇందులోకి ల్యాండ్ క్రూయిజర్ రావడం సరికొత్త చర్చకు దారితీస్తోంది.

# ట్రాన్స్ జెండర్లకు పెరిగిన గౌరవం

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవ ఉపాధి అవకాశాలు కల్పించడంలో చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోంది. మహబూబాబాద్‌కు చెందిన శ్రావణి, ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ట్రాఫిక్ అసిస్టెంట్ పోస్టుల్లో ఉద్యోగం పొందారు. హైదరాబాద్‌కు చెందిన ప్రేం లీలా, జూట్ బ్యాగ్ మాన్యుఫాక్చరింగ్ వ్యాపారంలో రాణించి మార్పుకు ప్రతీకగా నిలుస్తున్నారు. సురారం ప్రాంతానికి చెందిన జాస్మిన్ స్వయంగా పిండి వంటల వ్యాపారాన్ని ప్రారంభించారు.శ్రావణి, చిన్ననాటి నుంచి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని, తెలంగాణ ప్రభుత్వంతో ట్రాఫిక్ అసిస్టెంట్‌గా పనిచేయడానికి అవకాశాన్ని పొందారు. "చిన్నప్పుడు స్కూల్‌కు వెళ్లడం నాకు ఎంతో కష్టంగా అనిపించేది. తోటి పిల్లల మాటలు, పెద్దల అంగీకారం లేకపోవడం నా జీవన ప్రయాణంలో ప్రతీ అడుగునా ఇబ్బందికరంగా మారాయి," అని శ్రావణి చెప్పారు."ప్రారంభ దశలో నాకు సాధారణ ఉపాధి అవకాశాలు కూడా లభించలేదు. 'భిక్షాటనే మాకు జీవనోపాధి' అని, నేను నా పాత జీవితాన్ని గుర్తు చేసుకుంటున్నాను. కానీ తెలంగాణ ప్రభుత్వం గౌరవంగా ఈ ఉద్యోగాన్ని ఇచ్చింది. 20 రోజుల శిక్షణ అనంతరం నేను ప్రస్తుతం చిలకలగూడా పరిధిలోని ఆలుగడ్డబావి సర్కిల్‌లో డ్యూటీ చేస్తున్నాను. మాకు అన్నివిధాలుగా చక్కటి ట్రానింగ్ ఇస్తున్నారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సార్, తెలంగాణ సీఎం రేవంత్ సార్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు," అని శ్రావణి తెలిపారు. ప్రేం లీలా: స్వయం ఉపాధికి ఆదర్శం ప్రేం లీలా, 2021లో తెలంగాణ ప్రభుత్వ నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా జూట్ బ్యాగ్ తయారీ శిక్షణ తీసుకుని, 'ప్రేం లీలా క్రియేషన్స్' అనే తన బ్రాండ్‌ను స్థాపించారు. ఎకో ఫ్రెండ్లీ బ్యాగ్‌ల తయారీలో తనదైన గుర్తింపు పొందారు. "నా జీవితంలో నేను ఏదోకటి సాధిస్తాను అన్న నమ్మకాన్ని ఎప్పటికీ కోల్పోలేదు. మాకు అవకాశం వస్తే మార్పు తథ్యమని తెలుసు," అని ప్రేం లీలా తెలిపారు."ఇది కేవలం వ్యాపారం కోసం మాత్రమే కాదు; ట్రాన్స్‌కమ్యూనిటీ వారికి ఉద్యోగ అవకాశాలు కూడా మున్ముందు కలిపించడానికి నేను కృషి చేస్తున్నాను," అని ఆమె చెప్పారు. తెలంగాణ ఇంద్ర మహిళా శక్తి పథకం ద్వారా త్వరలో శిల్పరామంలో పర్మనెంట్ స్టాల్ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది"ఎన్నో సంవత్సరాలుగా మా ట్రాన్స్‌జెండర్స్‌కు ఉద్యోగ అవకాశాలు లేక ఆనేక కష్టాలు అనుభవించాము. సమాజంలో మమ్మల్ని ఛీ కొట్టిన వారే ఎక్కువ. ఇప్పుడు మేమంతా కలిసి మా సొంత వ్యాపారాలాను ప్రారంభించాం. చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌లో మాకు ఒక పర్మినెంట్ స్టాల్, ట్రాలీ స్టాండ్‌ను కేటాయించారు. నేను స్వయంగా తయారుచేసే తెలుగు పిండి వంటల స్నాక్స్‌తో ఒక వ్యాపారం నడుపుతున్నాను. 'జనమ్ తో జస్మిన్' అనే యూట్యూబ్ ఛానల్‌ను కూడా నిర్వహిస్తున్నాను. నా ఛానెల్‌లో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారతపై కంటెంట్‌ను ప్రొడ్యూస్ చేస్తాను," అని జాస్మిన్ తెలిపారు."త్రిపుర సుందరీ, సహస్రా అనే ఇద్దరు ట్రాన్స్ మహిళలు కూడా ఇక్కడ జ్యూట్ బ్యాగ్స్ తయారు చేసి, తమ ఉత్పత్తులను స్టాల్‌లో ఉంచారు," అని జస్మిన్ పేర్కొన్నారు.ఈ విధంగా, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు గౌరవ ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో వివక్షను తొలగించడమే కాకుండా, వారికి గౌరవంగా జీవించే అవకాశాలు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.

"ప్రతి ఒక్కరికి గౌరవంతో జీవించే హక్కు ఉంది. ఇవి చిన్న అడుగులే అయినా, సమాజ మార్పుకు ఉదాహరణగా నిలుస్తాయి," అని శ్రావణి అభిప్రాయపడ్డారు.

# వరంగల్ లో ఆన్ లైన్ మోసం

వరంగల్: ఆన్ లైన్ ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు పేరున వరంగల్ నగర శివారులోని ఓ ప్రముఖ కాలేజీని సైబర్ కేటుగాళ్లు మోసం చేయగా.. సంబంధిత కాలేజీ ప్రిన్సిపల్ సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.వరంగల్ నగర శివారులోని ఓ ప్రముఖ కాలేజీ మెయిల్ ఐడీకి 2024 సెప్టెంబర్ 18న గవర్నమెంట్ జాబ్స్, ఇతర ఆన్ లైన్ ఎగ్జామ్స్ కండక్ట్ చేసేందుకు సెంటర్ ఏర్పాటు కోసం బెంగళూరుకు చెందిన ఓ ప్రముఖ కంపెనీ నుంచి మెయిల్ వచ్చింది.బెంగళూరు కు చెందిన సంస్థ, కాలేజీతో కలిసి సంయుక్తంగా ఆన్ లైన్ ఎగ్జామ్స్ నిర్వహించేందుకు అంగీకారం కోసం మెయిల్ పంపించగా.. ఇక్కడి కాలేజీ యాజమాన్యం అందుకు ఓకే చెప్పింది. దీంతో అవతలి వైపు నుంచి పరీక్షల నిర్వహణ కోసం అప్లికేషన్ ఫామ్ ను మెయిల్ ద్వారానే పంపించగా.. దానిని కాలేజీ యాజమాన్యం ఫిల్ చేసి తిరిగి అదే మెయిల్ ఐడీకి పంపించేశారు.ఆ తరువాత ఎగ్జామినేషన్ సెంటర్ అగ్రిమెంట్ కోసం డాక్యుమెంట్స్ పంపించాల్సిందిగా కోరడంతో కాలేజీ యాజమాన్యం ఆ పని కూడా పూర్తి చేసింది. కాలేజీ యాజమాన్యం ఎగ్జామినేషన్ సెంటర్ నిర్వహణకు అగ్రిమెంట్ కాపీలు పంపించగా. రిజిస్ట్రేషన్ కోసం రిఫండబుల్ ఫీజు పేరున రూ.42,600 పంపాల్సిందిగా అవతలి నుంచి రిప్లై వచ్చింది. దీంతో వారు చెప్పిన ప్రకారం కాలేజీ యాజమాన్యం అమౌంట్ పంపించింది. ఆ తరువాత కాలేజీ బిల్డింగ్ ప్లాన్, ఓనర్ షిప్ డాక్యుమెంట్స్, కరెంట్ బిల్, ఇంటర్నెట్ కనెక్షన్ వివరాలు సేకరించి, గత డిసెంబర్ నెలలో ఎగ్జామినేషన్ ఎక్విప్ మెంట్ సంయుక్తంగా కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అందుకు రూ.2.95 లక్షలు పంపించాల్సిందిగా కోరడంతో కాలేజీ అకౌంట్ నుంచి పంపించారు.తరువాత అదే నెలలో ఎక్విప్ మెంట్, ఫర్నిచర్ ట్రాన్స్ పోర్ట్ కోసం రూ.79 వేలు , ఫర్నిచర్ ఇన్సురెన్స్ పేరున రూ.2.6 లక్షలు పంపించాల్సిందిగా మళ్లీ మెయిల్ చేయడంతో ఆ మొత్తాన్ని కూడా వారు చెప్పిన అకౌంట్ కు బదిలీ చేశారు. ఇంతవరకు బాగానే ఉండగా, ఆ తరువాత సంబంధిత కంపెనీ నుంచి కాలేజీ యాజమాన్యానికి ఎలాంటి ఫోన్ కానీ, మెయిల్ కానీ రాలేదు.ఇదివరకు కాలేజీ యాజమాన్యానికి కాల్స్ వచ్చిన ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసినా కలవకపోవడంతో సంబంధిత వివరాలు జోడించి ఈ నెల 6వ తేదీన పోలీసులకు కాలేజీ ప్రిన్సిపల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ఎస్ 318(4), ఐటీ యాక్ట్ 66డీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# ఆగని సైబర్ దాడులు

ముంబై: మోసగాళ్లు సాంకేతికతను తమకు అనుకూలంగా మలుచుకుని ప్రజలను మోసం చేసి సొమ్ము దోచుకుంటున్నారు. తాజాగా భారత్‌లో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడంతో ముంబైకి చెందిన ఓ వృద్ధురాలు రూ.1.5 కోట్లు పోగొట్టుకుంది. దక్షిణ ముంబైకి చెందిన 78 ఏళ్ల వృద్ధురాలు. ముంబై అత్యంత ప్రసిద్ధ ఆర్కిటెక్ట్ బంధువు. తనపై మనీ ఫ్రాడ్ ఫిర్యాదు అందిందని పేర్కొంటూ మోసానికి పాల్పడ్డాడు. యుఎస్ నుండి తన కుమార్తెకు ఆహారం పంపడానికి ఒక వృద్ధ మహిళ కొరియర్ సర్వీస్‌ను ఉపయోగించడంతో స్కామ్ చేశారు. వృద్ధురాలు కొరియర్ చేయడానికి ప్రయత్నించగా, మరుసటి రోజు ఆమెను సంప్రదించిన వ్యక్తి తాను కొరియర్ కంపెనీ నుండి మాట్లాడుతున్నానని చెప్పాడు.వృద్ధురాలు అక్రమంగా సరుకులు రవాణా చేస్తుందని మోసగాడు భయపెట్టాడు. అలాగే వృద్ధురాలి పేరిట ఉన్న పార్శిల్‌లో వృద్ధురాలి ఆధార్ కార్డు, గడువు ముగిసిన పాస్‌పోర్టు, క్రెడిట్ కార్డు, 2000 అమెరికన్ డాలర్లు, అక్రమ వస్తువులు ఉన్నాయని తెలిపారు. అంతే కాకుండా వృద్ధురాలిపై మరికొన్ని ఆరోపణలు చేశాడుఆ తర్వాత వృద్ధురాలి నుంచి డబ్బులు వసూలు చేయాలనే లక్ష్యంతో మోసగాళ్లు పలు శాఖల ఉన్నతాధికారులను సంప్రదించారు. ఆడియో కాల్‌తో పాటు, ఉన్నతాధికారుల వేషధారణతో వీడియో కాల్ ద్వారా వృద్ధురాలిని సంప్రదించారు. ఆ తర్వాత అరెస్ట్ రిపోర్టుతో సహా పలు పత్రాలను బెదిరించారు. దీంతో భయపడిన వృద్ధురాలు వారి సూచనల మేరకు రూ.1.51 కోట్లను మోసగాళ్లకు పంపించింది. ఇలాంటివి దేశంలో ఎన్నో జరుగుతున్నాయి. మీ బ్యాంకు ఏటీఎం బ్లాక్ అయ్యిందనే, లేక కేవైసీ పేరుతో ఇలా రకరకాల సాకులు చెబుతూ జనాలను నిలువునా దోచుకుంటున్నారు. ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు జరుగుతున్నాయి. అందువల్ల, ఎవరైనా మిమ్మల్ని ఈ విధంగా సంప్రదిస్తే, ఏ కారణం బ్యాంక్ ఖాతా వివరాలు, డబ్బు లావాదేవీలు వంటి వివరాలు చెప్పవద్దు. పోలీసులు, ఆదాయపన్ను అధికారుల మంటూ కాల్స్ చేసిన స్పందించవద్దు. ముఖ్యంగా బ్యాంకుల పేరుతో ఎవరు కాల్ చేసి వివరాలు అడిగినా ఎట్టి పరిస్థితుల్లో చెప్పవదని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే కేవైసీకి సంబంధించి వివరాలు, ఓటీపీలు అస్సలు చెప్పకండి. లేకుంటే తీవ్రంగా మోసపోయే ప్రమాదం ఉంది.

# ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న..



భీంగల్ రూరల్: శుక్రవారం రోజున భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రత్యేక తనిఖీ అధికారి దాసరి ఒడ్డెన్న కళాశాలను సందర్శించి తనిఖీ చేశారు. వారు ప్రత్యేకంగా అన్ని తరగతి గదులను తనిఖీ చేస్తూ విద్యార్థుల నుండి అనేక ప్రశ్నలకు సమాధానాలను రాబట్టి వారి ఉత్తీర్ణతకు కావలసిన అన్ని రకాల సూచనలను విద్యార్థులకు అందించారు.

అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డితో పాటు అధ్యాపక బృందంతో చిన్నపాటి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రతి గ్రూపు అధ్యాపకులను విద్యార్థుల యొక్క ఉత్తీర్ణత శాతం పెంచటంకోసము మీరు యాక్షన్ ప్లాన్ కు సంబంధించిన అంశాలను ఎలా అమలు చేస్తున్నారో ప్రశ్నించి పలు రకాల సమాధానాలను రాబట్టినారు. అంతేకాకుండా మార్చ్ లో జరిగే ఐ.పి.ఈ. పరీక్షలలో అనుకున్న దానికంటే ఎక్కువగా ఉత్తీర్ణశాతము రావాలని ఉత్తీర్ణతా శాతం ఎలా పెంచాలో కూడా పలు సూచనలు చేశారు. అంతేకాకుండా ప్రాక్టికల్ కు సంబంధించిన అన్ని రకాల విషయాలపై సైన్స్ అధ్యాపకులను ప్రశ్నించి, వారి వద్ద నుండి సమాధానాలను రాబట్టుకున్నారు. కళాశాలకు రాని విద్యార్థులను కళాశాలకు రప్పించి వారికి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు విద్యార్థుల యొక్క ఉత్తీర్ణతశాతం తక్కువగా వచ్చినట్లయితే బోర్డు అధికారులు కఠినమైన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. అనంతరము కళాశాల విద్యార్థుల రిజిస్టర్ లను మరియు టీచింగ్ డైరీలను తనిఖీ చేసి వెళ్లారు. ఇట్టి కార్యక్రమంలో కళాశాలను తనిఖీ చేసిన దాసరి ఒడ్డెన్న,కళాశాల ప్రిన్సిపల్ జయపాల్ రెడ్డి మరియు అధ్యాపక బృందము పాల్గొన్నారు.

# తాడిచెర్ల జూనియర్ కళాశాలలో ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు..

**– మంత్రి శ్రీధర్ బాబు చిత్ర పటానికి పాలాభిషేకం**

**– తాజా మాజీ ఎంపిపి మలహల్ రావు**



మల్హర్ రావు: తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శాఖ దుద్దిళ్ళ శ్రీదర్ బాబు ను అడుగగానే మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షిక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లుగా తాజా మాజీ ఎంపిపి చింతలపల్లి మలహల్ రావు తెలిపారు.మంత్రి ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలోపు పరీక్ష కేంద్రం ఏర్పాటు, ప్రధాన రోడ్డు నుంచి జూనియర్ కళాశాల వరకు రూ.30 లక్షలతో సిసి రోడ్డు,కళాశాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లుగా తెలిపారు.పరీక్ష కేంద్ర ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎంపీపీ మలహల్ రావు, తమ వినతి మేరకు సంబంధించిన కమిషనర్ తో మాట్లాడి కేంద్రాన్ని తీసుకొచ్చిన మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబుకు విద్యార్థుల,అధ్యాపకుల,పోషకుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతుమనట్లుగా కళాశాల ప్రిన్స్‌పాల్ విజయదేవి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేశారపు చెంద్రయ్య,ఇందారపు చెంద్రయ్య, బొబ్బిలి రాజు గౌడ్,బూడిద రాజా సమ్మయ్య,రాగం రమేష్,మెరుగు రాజయ్య,కటకం మధుసూదన్,మెడగాని చెంద్రమొగిలి,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైరా రిజిస్ట్రేషన్ ఆఫీసులో అర్ధరాత్రి రిజిస్ట్రేషన్లు

ఖమ్మం: కేరోజు 99 రిజిస్ట్రేషన్లు.. అది కూడా రాత్రిపూట.. ఇంతకీ ఆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది? కోట్ల విలువైన భూమి.. రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్ అయింది. ఇలా ఒకటి కాదు రెండు కాదు 99 దాకా రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. రాత్రిపూట ఈ వ్యవహారం జరగడం అనుమానాలకు తావిస్తోంది. ఇలా రిజిస్ట్రేషన్ అయిన భూమి విలువ దాదాపు వందల కోట్లు ఉంటుంది. ఈ సంఘటన జరిగిన వెంటనే రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిస్పందించారు ఉమ్మడి ఖమ్మం జిల్లనుంచి భట్టి విక్రమార్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా ఉన్నారు. వీరిలో భట్టి విక్రమార్క సొంత మండలం అయిన వైరాలో 99 రిజిస్ట్రేషన్లు ఒక్కరోజు రాత్రి పూర్తి కావడం అనుమానాలకు తావిస్తోంది.. వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయం వేదికగా రాత్రి సమయంలో ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ వ్యవహారం రిజిస్ట్రేషన్లు స్టాంపులు శాఖలో కలకలం రేపుతోంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంలో ఆమోదం పొందని స్థిరాస్తి ప్లాట్లకు 99 రిజిస్ట్రేషన్లు చేయడం విశేషం. వైరా అసెంబ్లీ నియోజకవర్గంగా ఉంది. ఇది ఖమ్మం నగర పాలక సంస్థకు దగ్గర్లోనే ఉంటుంది. వైరా పురపాలక సంఘంగా ఏర్పడింది. వైరా నియోజకవర్గ పరిధిలో కొనిజర్ల మండలం ఉంటుంది. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఈ మండలంలో భూములకు విపరీతమైన ధరలు ఉన్నాయి. ఈ మండలంలో అనేకంగా స్థిరాస్తి వెంచర్లు ఉన్నాయి. కొన్ని వెంచర్ల నిర్వాహకులు ఎల్ ఆర్ ఎస్ పథకానికి దరఖాస్తు చేసుకున్నా అనుమతులు ఇంకా రాలేదు. అయితే క్రమబద్ధీకరణకు అనుమతులు లభించని ప్లాట్లకు వైరా సబ్ రిజిస్ట్రార్ ఏకంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడం సంచలనం కలిగిస్తోంది. కొణిజర్ల మండలంలో తనికెళ్ళ, అమ్మపాలెం గ్రామాల్లో విస్తారంగా వెంచర్లు ఉన్నాయి. ఇక్కడ భూమికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ ఏర్పాటుచేసిన వెంచర్లలో సరైన నిబంధనలు పాటించలేదని ఆరోపణలు ఉన్నాయి.. గత ప్రభుత్వం అనుమతి పొందని లేఅవుట్లలో స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయకుండా నిబంధనలు విధించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధంగా కొనసాగిస్తోంది.. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. ఇప్పటివరకు 4.50 లక్షల దరఖాస్తులను పూర్తి చేసామని అధికారులు చెబుతున్నారు.. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిటిసిపి, రెరా అనుమతులు పొందిన వెంచర్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది..ఎల్ ఆర్ ఎస్ లేకపోయినప్పటికీ గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేయడం అనుమానాలకు తావిస్తోంది. దీని వెనక భారీగానే నగదు చేతులు మారిందని తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రంగంలోకి దిగారు.. రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు . ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని డిఐజికి ఆదేశాలు జారీ చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే రెవెన్యూ శాఖలో ప్రక్షాళన మొదలుపెట్టారు.. దాదాపు అందరి అధికారులను బదిలీ చేశారు. చాలాకాలం ఒకే చోట పని చేసిన అధికారులను మరో ప్రాంతానికి ట్రాన్స్ఫర్ చేశారు. రెవెన్యూ విభాగంలో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేశారు. ఇంత చేస్తున్నప్పటికీ ఇలా జరగడం రెవిన్యూ శాఖ ఉన్నతాధికారులకు మింగుడు పడటం లేదు.

# రైతులు లాభసాటి పంటలను సాగు చేయాలి

**– సత్తుపల్లి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ, సింగరేణి వ్యవసాయ గోదాం పనులకు శంకుస్థాపన,**

**– కో ఆపరేటివ్ సొసైటీ, జి.పి. భవనాలను ప్రారంభించిన మంత్రి తుమ్మల**

ఖమ్మం: రైతాంగ సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి సత్తుపల్లి మండలంలో పర్యటించి సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డా. మట్టా రాగమయి దయానంద్ తో కలిసి పలు రోడ్డు నిర్మాణ, సింగరేణి వ్యవసాయ గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, కో ఆపరేటివ్ సొసైటీ, జి.పి. భవనాలను ప్రారంభించారు. బుగ్గపాడు గ్రామంలో బుగ్గపాడు ఆర్ అండ్ బి రోడ్డు నుండి నాగుపల్లి ఆర్ అండ్ బి రోడ్డు వరకు రోడ్డు నిర్మాణ పనులకు, కాకర్లపల్లి గ్రామంలో బి.టి., సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి కాకర్లపల్లి గ్రామంలో నిర్మించిన కోపరేటివ్ సొసైటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగూడెం- పాల్వంచ ప్రాంతంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ఈ నెలలో బృందం పర్యటన కూడా ఉంటుందని అన్నారు. పొలాలకు నీరు, పిల్లలకు చదువు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అందించిందని అన్నారు. బేతుపల్లి కాలువ తన హయాంలో పూర్తి చేశామని, వేంసూరు మండలం నేడు పచ్చగా తయారయిందని అన్నారు. ఆ మండలంలో యువత అమెరికాలో సంపాదించి నేడు హైదరాబాదులో సాఫ్ట్ వేర్ కంపెనీలు ప్రారంభించారని , 40 ఏళ్ళ క్రితం త్రాగునీరు లేని గ్రామాలు నేడు పంటల మయం చేశామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కొత్త వ్యవసాయ సహకార సంఘాలు అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు పంపాలని మంత్రి సూచించారు. సహకార సొసైటీలను బలోపేతం చేయడం ద్వారా ఎరువులు, గోదాములే కాకుండా యంత్ర సామాగ్రి కూడా అందించే కార్యక్రమం శ్రీకారం చుడుతున్నామని అన్నారు. రైతుల ముఖాలలో చిరునవ్వు ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశారని, రైతు బీమా క్రింద 3 వేల కోట్లు, రైతు బంధు క్రింద 7600 కోట్లు అందించారని అన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా క్రింద రైతుల ఖాతాలలో దాదాపు 10 వేల కోట్లు జమ చేయబోతున్నామని అన్నారు.రాబోయే పంట సీజన్ నుంచి రైతులకు పూర్తి స్థాయిలో పంట బీమా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కష్టంగా ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం కోసం దాదాపు మొదటి సంవత్సరం 40 వేల కోట్లు ఖర్చు చేశామని, మార్చి లోపుల మరో 10 వేల కోట్లు రైతాంగ పథకాల కోసం ఖర్చు పెడతామని అన్నారు. అనంతరం సత్తుపల్లి మండలానికి చెందిన 59 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల తహసీల్దార్ యోగేశ్వర రావు, సొసైటీ అధ్యక్షులు, కార్యవర్గం సభ్యులు, సత్తుపల్లి పట్టణ, మండలం ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# 44 ఏళ్లుగా చెక్కు చెదరని రికార్డ్.. గంభీర్-రోహిత్ ఏం చేస్తారో..?




తీవ్ర మనోవేదన మిగిల్చిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ పరాభవం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న టీమిండియా మరో సవాల్‌కు సిద్ధమైంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో పాటు మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ముందుగా ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జనవరి 22 నుంచి ప్రారంభం కానుంది.

ఫిబ్రవరి 6 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 బరిలోకి దిగనుంది. ఈ మెగా టోర్నీకి ముందు ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌ను టీమిండియా సన్నాహకంగా వాడుకోనుంది. అయితే ఈ వన్డే సిరీస్‌కు ముందు టీమిండియా అభిమానులను ఓ విషయం ఆందోళనకు గురిచేస్తోంది. గత 44 ఏళ్లుగా భారత గడ్డపై ఇంగ్లండ్ వన్డే సిరీస్ గెలవలేదు. ప్రతీ ఏడాది ఇంగ్లండ్.. భారత పర్యటనకు వస్తున్నా వన్డే సిరీస్ గెలవలేదు. ఇటీవల టీమిండియాకు వరుస పరాజయాలు ఎదురవుతున్ననేపథ్యంలో ఈ రికార్డ్ కూడా బద్దలు అవుతుందా? అనే భయం అభిమానులకు పట్టుకుంది. ముఖ్యంగా టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్.. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఘోర పరాజయాలు ఎదురవుతున్నాయి.

హెడ్ కోచ్ గంభీర్ తొలి పర్యటనలోనే మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. శ్రీలంకతో టీ20 సిరీస్ గెలిచిన టీమిండియా.. వన్డే సిరీస్ ఓడిపోయింది. 27 ఏళ్ల సుదీర్ఘ సమయం తర్వాత శ్రీలంక చేతిలో వన్డే సిరీస్ ఓటమిపాలైంది. ఆ తర్వాత సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయ్యింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై తొలిసారి టీమిండియా క్లీన్ స్వీప్ అవ్వగా.. న్యూజిలాండ్ ఫస్ట్ టైమ్ టెస్ట్ మ్యాచ్‌తో పాటు సిరీస్ గెలిచింది.

ఆ తర్వాత ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 1–3తో కోల్పోయింది. 10 ఏళ్ల తర్వాత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని చేజార్చుకుంది. ఈ వరుస పరాజయాల నేపథ్యంలోనే ఇంగ్లండ్‌తో కూడా టెస్ట్ సిరీస్ కోల్పోతుందనే భయం అభిమానులను వెంటాడుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ గెలవడం టీమిండియాకు అత్యవసరం.

# రిషభ్ పంత్ డిఫెన్స్ అద్భుతం: అశ్విన్




టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌పై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. రిషభ్ పంత్ డిఫెన్స్ అద్భుతంగా ఉంటుందని కొనియాడాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ డిఫెన్సివ్ టెక్నిక్ కలిగిన ప్లేయర్ రిషభ్ పంత్ అని అభిప్రాయపడ్డాడు.

ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రిషభ్ పంత్ పర్వాలేదనిపించాడు. సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో తన శైలికి భిన్నంగా నిదానంగా ఆడిన పంత్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం టీ20 తరహా బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో నిర్లక్ష్యపు షాట్‌తో ఔటైన పంత్‌పై విమర్శలు రాగా.. రెండో ఇన్నింగ్స్‌పై ప్రశంసల జల్లు కురిసింది. తాజాగా రిషభ్ పంత్ బ్యాటింగ్ గురించి మాట్లాడిన అశ్విన్ అతనిపై ప్రశంసల జల్లు కురిపించాడు.

'రిషభ్ పంత్‌కు ఏం చేయాలనేది సరైన పద్దతిలో చెప్పాలి. ఆస్ట్రేలియా పర్యటనలో మరిన్ని పరుగులు చేయలేకపోయాడు. కానీ అందరిలా కాకుండా మెరుగైన ఇన్నింగ్స్‌తో ఆసీస్ పర్యటనను ముగించాడు. ఇప్పటికీ రిషభ్ పంత్ అసలు సామర్థ్యం బయటకు రాలేదు. అతను అన్ని రకాల షాట్లను ఆడగలడు.

స్వీప్, రివర్స్ స్వీప్, స్లాగ్ స్వీప్, అప్పర్ కట్.. ఇలా ప్రతీ షాట్ ఆడగలడు. అయితే ఇవన్నీ హై రిస్క్ షాట్లు. అయినా అలవోకగా ఆడేస్తాడు. రిషభ్ పంత్ డిఫెన్సివ్ మోడ్‌లో 200 బంతులు ఎదుర్కొంటే ప్రతీ మ్యాచ్‌లోనూ సెంచరీ చేయగలడు. అందుకే ఎప్పుడు దూకుడుగా ఆడాలి. ఎక్కడ డిఫెన్స్ ఆడాలనేది అతనికి తెలుసు. కానీ, ఆ రెండింటిని సరిగ్గా సమన్వయం చేస్తేనే ఫలితం సానుకూలంగా ఉంటుంది.

సిడ్నీ టెస్ట్‌లో పంత్ రెండు రకాల ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో నిదానంగా ఆడుతూ 40 పరుగులు చేశాడు. కానీ, ఫీల్డర్‌ను చూసుకోకుండా తనదైన షాట్ ఆడి ఔటయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. దాంతో అందరూ అతన్ని కొనియాడారు. తొలి ఇన్నింగ్స్ గురించి మరిచిపోయారు.

అదే సమయంలో పంత్ దూకుడును అర్థం చేసుకోవాలి. చాలా తక్కువ సందర్భాల్లోనే పంత్ డిఫెన్స్ ఆడుతూ ఔటవుతాడు. ఎంతటి ఫాస్టెస్ట్ బౌలర్ బౌలింగ్ చేస్తున్నా పంత్.. చాలా నింపాదిగా బ్యాటింగ్ చేస్తాడు. అది అతని ప్రత్యేకం. పంత్ 10 బంతులను ఆడుతూ ఔటైనట్లు చూపిస్తే నా పేరు మార్చుకుంటా'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

# అర్ష్‌దీప్ సింగ్ స్టన్నింగ్ డెలివరీ.. బిత్తరపోయిన రుతురాజ్



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ముందు టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ సంచలన ప్రదర్శనతో సెలెక్టర్లను ఆకట్టుకుంటున్నాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న అర్ష్‌దీప్ సింగ్ అద్భుత బౌలింగ్‌తో రాణిస్తున్నాడు. ముఖ్యంగా కొత్తబంతితో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. స్వింగ్, రివర్స్ స్వింగ్‌తో బ్యాటర్లను పెవిలియన్ చేర్చుతున్నాడు. తాజాగా మహారాష్ట్రతో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ ఫస్ట్ స్పెల్‌లోనే రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. స్టన్నింగ్ డెలివరీతో మహారాష్ట్ర కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(5)తో పాడు సిద్దేశ్ వీర్‌ను వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు.

అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌కు రుతురాజ్ గైక్వాడ్(5) బిత్తరపోయాడు.


ఈ మ్యాచ్‌లో పంజాబ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా.. మహారాష్ట్ర బ్యాటింగ్‌కు దిగింది. తొలి ఓవర్‌లోనే మహారాష్ట్రకు అర్ష్‌దీప్ సింగ్ బిగ్ షాకిచ్చాడు. వరుసగా ఐదు బంతులను ఇన్ స్వింగర్‌గా వేసి రుతురాజ్ గైక్వాడ్ లయను దెబ్బతీసిన అర్ష్‌దీప్ సింగ్.. ఆఖరి బంతిని మాత్రం ఔట్ స్వింగర్‌గా వేసి క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ బంతిని అంచనా వేయడంలో విఫలమైన రుతురాజ్ గైక్వాడ్.. ఇన్ స్వింగర్ కోసం ఆడి మూల్యం చెల్లించుకున్నాడు. బ్యాట్‌ను మిస్సైన బంతి ఆఫ్ స్టంప్ వికెట్‌ను లేపేసింది. రుతురాజ్ నిరాశగా పెవిలియన్ చేరాడు.

తన మరుసటి ఓవర్‌లోనూ లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేసిన అర్ష్‌దీప్ సింగ్ సిద్దేశ్ వీర్(0) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ రెండు వికెట్లకు సంబంధించిన వీడియోను బీసీసీఐ సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో తొలి స్పెల్‌లో 5 ఓవర్లు బౌలింగ్ చేసిన అర్ష్‌దీప్ సింగ్ ఒక ఓవర్ మెయిడిన్ చేయడంతో పాటు 2 వికెట్లు పడగొట్టాడు.

8 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ మహారాష్ట్రను అర్షిని కులకర్ణి ఆదుకున్నాడు. అసాధారణ బ్యాటింగ్‌తో శతకం దిశగా సాగుతున్నాయి. 40 ఓవర్లు ముగిసే సరికి మహారాష్ట్ర 3 వికెట్లకు 191 పరుగులు చేసింది.

ఈ టోర్నీలో ఇప్పటి వరకు 7 మ్యాచ్‌లు ఆడిన అర్ష్‌దీప్ సింగ్ 17.36 సగటుతో 19 వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనతో అతను ఛాంపియన్స్ ట్రోఫీకి సిద్ధంగా ఉన్నానని సెలెక్టర్లకు చాటి చెప్పాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీ ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అర్ష్‌దీప్ సింగ్‌కు చోటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# మలింగా, తీక్షణ తీన్మార్.. న్యూజిలాండ్‌పై శ్రీలంక ఘన విజయం!



న్యూజిలాండ్ పర్యటనను శ్రీలంక విజయంతో ముగించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అక్లాండ్ వేదికగా శనివారం జరిగిన ఆఖరి వన్డేలో శ్రీలంక 140 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ సిరీస్‌ను ఇప్పటికే 2–0తో కైవసం చేసుకున్న న్యూజిలాండ్.. ఆఖరి వన్డేలో మాత్రం దారుణంగా విఫలమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 290 పరుగులు చేసింది. పాతుమ్ నిస్సంక(42 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 66), కుశాల్ మెండీస్(48 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54), జనిత్ లియనగే(52 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(4/55) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ సాంట్నర్(2/55) రెండు వికెట్లు పడగొట్టాడు.నాథన్ స్మిత్, మైఖేల్ బ్రేస్‌వెల్ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన న్యూజిలాండ్ 29.4 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. మార్క్ చాప్‌మన్(81 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 81)హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో, మహీష్ తీక్షణ, ఇషాన్ మలింగా మూడేసి వికెట్లు తీయగా.. జనిత్ లియనగే ఓ వికెట్ పడగొట్టాడు. మూడు టీ20లు, మూడు వన్డేల కోసం న్యూజిలాండ్ పర్యటనకు వచ్చిన శ్రీలంక.. రెండు సిరీస్‌లను 1–2, 1–2 తేడాతో ఓటమిపాలైంది.

# జట్టు ప్రకటనపై హ్యాండిచ్చిన బీసీసీఐ




ఛాంపియన్స్ ట్రోఫీకి మరి కొద్ది రోజులే సమయం మిగిలి ఉంది. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించబోయే జట్టుపై బీసీసీఐ సెలక్టర్లు ఇంకా ఓ నిర్ణయానికి రాలేదని తెలిసింది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం జనవరి 12 ఆదివారంలోగా ప్రకటించాలి. కానీ, బీసీసీఐ మాత్రం ఇంకాస్త సమయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం అందింది.

ఛాంపియన్స్ ట్రోఫీ కన్నా ముందు టీమ్ ఇండియా.. ఇంగ్లాండ్ తో సిరీస్ ఆడనుంది. దీంతో ఇంగ్లాండ్ సిరీస్ తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఒకేసారి జట్లను ఎంపిక చేయాలని సెలక్షన్ కమిటీ భావించింది. అయితే ఇప్పుడు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ యూటర్న్ తీసుకున్నట్లు తెలిసింది. మొదట ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్‌కు మాత్రమే జట్టును ప్రకటించాలని ఫిక్స్ అయిందట. ఇవాళ లేదా ఆదివారం జట్టును ప్రకటించనుందని క్రికెట్ వర్గాలు అంటున్నాయి.

ఐసీసీకి విజ్ఞప్తి చేసిన బీసీసీఐ

ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే దేశాలు, ఈ మెగా ట్రోఫీ ప్రారంభానికి కనీసం నెల రోజుల ముందే తమ జట్లను ప్రకటించాలి. కానీ, ఈసారి మాత్రం ఐదు వారాల ముందే ప్రకటించి, ఆ తర్వాత మార్పులు, చేర్పులు చేసుకునే విధంగా వెసులుబాటును కల్పించింది ఐసీసీ. కానీ బీసీసీఐ మాత్రం ఇప్పుడు నెల రోజుల ముందే జట్టును ప్రకటిస్తామని ఐసీసీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. అంటే జనవరి 19న ఛాంపియన్స్ ట్రోఫీ జట్టును ప్రకటించే అవకాశం ఉంది.

ఇంగ్లాండ్ సిరీస్ వాళ్లే ఛాంపియన్స్ ట్రోఫీకి

ఇంగ్లాండ్ తో మూడు వన్డేల సిరీస్‌ను టీమ్ ఇండియా స్వదేశంలో ఆడనున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 6 నుంచి ఈ సిరీస్ మొదలు కానుంది. అయితే వన్డే సిరీస్‌కు తీసుకోబోయే జట్టునే ఛాంపియన్స్ ట్రోఫీకి కొనసాగిస్తారని క్రికెట్ వర్గాల విశ్లేషణ. మహా అయితే ఒకటీ లేదా రెండు మార్పులు మాత్రమే ఉండొచ్చని అంటున్నారు.


# నీరజ్ చోప్రా - వరల్డ్ నెం.1గా ప్రతిష్టాత్మక అవార్డ్




వరుసగా రెండు ఒలింపిక్స్‌లో గోల్డ్, సిల్వర్‌తో చరిత్ర సృష్టించిన భారత స్టార్ జావెలిన్ త్రో అథ్లెట్ నీరజ్ చోప్ రాకు తాజాగా మరో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. 2024 సంవత్సరానికి గానూ అతడు ప్రపంచ ఉత్తమ జావెలిన్ త్రోయర్‌గా ఎంపికయ్యాడు.

ప్రపంచ వ్యాప్తంగా పేరు పొందిన ప్రముఖ అమెరికా మ్యాగజైన్ 'ట్రాక్ అండ్ ఫీల్డ్' మేటి పురుష జావెలిన్ త్రో అథ్లెట్‌గా నీరజ్‌ను సెలెక్ట్ చేసింది. దీంతో అతడు వరుసగా రెండో ఏడాది ర్యాంకింగ్స్‌లో నెం. 1గా నిలిచాడు. కాగా, ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్ మ్యాగజైన్ కు 78 ఏళ్ల చరిత్ర ఉంది. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన 27 ఏళ్ల నీరజ్, ఈ మ్యాగజైన్ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో రెండు సార్లు వరల్డ్ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా)ను వెనక్కినెట్టి ఈ అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. 2023లోనూ నీరజే తొలి స్థానంలో నిలిచాడు. నిరుడు డైమండ్ లీగ్‌లో దోహా, లాసానె, బ్రసెల్స్ పోటీల్లో నీరజ్ చోప్రా రెండో స్థానాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఫిన్‌లాండ్ వేదికగా జరిగిన పావో నూర్మి క్రీడల్లోనూ ఛాంపియన్‌గా నిలిచాడు. "అగ్రస్థానం కోసం 2023లో నంబర్‌వన్ గా నిలిచిన నీరజ్, 2022 విజేత అండర్సన్ మధ్య తేడాను స్పష్టంగా చెప్పలేం. డైమండ్ లీగ్‌లో నీరజ్ ఛాంపియన్‌గా నిలవలేదు. కానీ మొత్తంగా 3–2 తేడాతో అండర్సన్‌ను వెనక్కి నెట్టాడు. అండర్సన్, డైమండ్ లీగ్ మూడు అంచెల పోటీల్లోనూ విజయం సాధించాడు. అయితే పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం మెరుగైన ప్రదర్శన చేసిన కారణంగా నీరజ్ ముందు నిలిచాడు. మరో టోర్నీలో మాత్రమే పోటీపడి నాలుగో స్థానం దక్కించుకున్న ఒలింపిక్ గోల్డ్ మెడల్ అర్షద్ నదీమ్ ఐదో స్థానం కన్నా మెరుగైన ర్యాంకు దక్కించుకోలేకపోయాడు. " అని మేగజైన్ రాసుకొచ్చింది. కాగా, పారిస్ ఒలింపిక్స్‌లో నదీమ్ గోల్డ్ మెడల్, అండర్సన్ బ్రాంజ్ మెడల్ గెలిచిన సంగతి తెలిసిందే. నిరుడు ఒలింపిక్స్ లో కాకుండా నదీమ్ పారిస్ డైమండ్ లీగ్ అంచెలో మాత్రమే పోటీపడి నాలుగో స్థానంలో నిలిచాడు.

# ఆ అభిమానులు కుక్కలు.. హర్భజన్ సింగ్ ఘాటు వ్యాఖ్యలు!



సోషల్ మీడియా వేదికగా తనపై విమర్శలు గుప్పిస్తున్న అభిమానులపై టీమిండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. డబ్బులు తీసుకున్న కుక్కలు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.

ఆస్ట్రేలియాతో ఇటీవల ముగిసిన ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా సీనియర్ ఆటగాళ్లు దారుణంగా విఫలమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత సీనియర్ ఆటగాళ్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. హర్భజన్ సింగ్ కూడా భారత జట్టు వైఫల్యంపై ఘాటుగా స్పందించాడు. జట్టులో స్టార్ సంస్కృతికి గుడ్ బై చెప్పాలని సూచించాడు. టీమిండియా ప్రదర్శనపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన హర్భజన్ సింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పేరు ప్రస్తావించకుండా విమర్శలు గుప్పించిన హర్భజన్ సింగ్.. సీనియర్ బ్యాటర్లు అయిన రోహిత్ శర్మ, కోహ్లీలకు కూడా చురకలంటించాడు.


'రాహుల్ ద్రవిడ్ హెడ్ కోచ్‌గా ఉన్నప్పుడే టీమిండియా మెరుగ్గా ఆడింది. కానీ ఆ తర్వాత ఆకస్మాత్తుగా భారత జట్టుకు ఏమైందో నాకు అర్థం కావడం లేదు. గత ఆరు నెలల్లో వరుస పరాజయాలతో జట్టు ఒక్కసారిగా పతనమైనట్లు అనిపిస్తోంది. కోహ్లీ, రోహిత్ ఎవరైనా ఆట కంటే ఎవరూ ముఖ్యం కాదు.

కపిల్ దేవ్, అనిల్ కుంబ్లే వంటి మ్యాచ్ విన్నర్లు సైతం జట్టులో చోటు కోల్పోయారు. టీమిండియా సూపర్ స్టార్ సంస్కృతిని వదిలి పెట్టాలి. అభిమన్యు ఈశ్వరన్, సర్ఫరాజ్ ఖాన్‌లకు ఒక్క అవకాశం ఇవ్వలేదు. పేరున్న ఆటగాళ్లను కాకుండా బాగా ఆడే ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

హర్భజన్ సింగ్‌పై కోహ్లీ, రోహిత్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. వ్యక్తి జీవితానికి సంబంధించిన విషయాలు ప్రస్తావిస్తూ జుగుప్సాకరమైన రీతిలో ట్రోలింగ్‌కు పాల్పడ్డారు. ఈ ట్రోలింగ్‌పై భజ్జీ ఘాటుగా స్పందించాడు. డబ్బులు తీసుకున్న కుక్కలు మొరుగుతూనే ఉంటాయనే సామెతను పంచుకున్నాడు. 'మార్కెట్లో ఏనుగు వెళ్తుంటే.. డబ్బులు తీసుకున్న కుక్కలు మొరుగుతూనే ఉంటాయి'అని వ్యాఖ్యలను షేర్ చేశాడు.

# 'నా జీవితం కష్టంగా సాగుతోంది - ఇక ఆ దేవుడే దిక్కు!'

## – షమీ ఎమోషనల్



దేశవాళీ క్రికెట్ లో అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ, ఫిట్‌నెస్ నిరూపించుకోలేక బోర్డర్ – గావస్కర్ ట్రోఫీకి ఎంపికకాని స్టార్ పేసర్ మహ్మద్ షమీ, ఎలాగైనా ఈ సారి ఛాంపియన్స్ ట్రోఫీ 2025తో జాతీయ జట్టులోకి రీఎంట్రీ ఇవ్వాలని గట్టిగానే ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే తాజాగా తన కమ్ బ్యాక్ గురించి మాట్లాడాడు షమీ. ప్రస్తుతం తన జీవితం ఎంతో కష్టంగా గడుస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ–2025కి జట్టును ప్రకటించడానికి సమయం దగ్గర పడిన తరుణంలో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ పెరిగిపోతుంది. జట్టులోకి ఎవరిని తీసుకుంటారు, ఎవరిని పక్కకు పెడతారు అన్న విషయంపై తెగ చర్చించుకుంటున్నారు. అయితే చీలమండ గాయానికి శస్త్రచికిత్స చేయించుకుని బాధపడిన షమీ పూర్తిగా కోలుకున్నట్లు, ఈ మేరకు బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్యుల బృందం మహ్మద్ షమీకి ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి. దీంతో, అంతర్జాతీయ క్రికెట్‌లో షమీ రీఎంట్రీకి మార్గం సుగమం అయినట్టేనని కథనాలు వస్తున్నాయి.

ఇప్పటికే షమీ దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్నాడు. వన్డే ఫార్మాట్‌లో జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో మూడు మ్యాచుల్లో ఐదు వికెట్లు తీశాడు. సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీలో 11 వికెట్లు పడగొట్టాడు. పైగా నెట్ ప్రాక్టీస్ సెషన్ కూడా అద్భుతంగా చేస్తూ కనిపించాడు. దీంతో అతడు నేషనల్ టీమ్ లోకి రావడం గ్యారంటీ అనీ, ఇంగ్లాండ్ తో వైట్ బాల్ సిరీస్ కు, ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేస్తారని ప్రస్తుతం జోరుగా ప్రచారం సాగుతోంది.

ఈ క్రమంలోనే తాజాగా షమీ తన కమ్ బ్యాక్ పై స్పందించాడు. ఆనంద్ బజార్ పత్రికాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షమీ మాట్లాడుతూ .. "దేవుడు అనుకుంటే ప్రతీది సాధ్యమే. అన్నీ జరుగుతాయి. ఓ ప్లేయర్ కు ఆటే అన్నీ. అది లేకపోతే జీవితం అసంపూర్తిగా అనిపిస్తుంది. మరి అలాంటిది బంతి పట్టుకోకపోతే నా జీవితాన్ని ఎలా ఆస్వాదిస్తాను. జీవితం చాలా కష్టంగా సాగుతుందని మాత్రం చెప్పగలను. దేశానికి ఆడుతున్నామనే మోటివేషన్ చాలు. నా రిహ్యాబిలిటేషన్ లో ప్రతీరోజు ఇండియన్ జెర్సీని చూస్తూనే ఉంటాం. ఇక డొమాస్టిక్ క్రికెట్ లో బెంగాల్ జట్టుకు ఆడటంతో , నా పాత రోజుల అనుభూతి కలిగింది. అది నాలో కొత్త శక్తిని ఇచ్చి సరికొత్త ఉత్సాహాన్ని నింపింది." అని చెప్పుకొచ్చాడు.

కాగా, షమీ చివరి సారిగా 2023 వన్డే ప్రపంచ కప్‌లో అంతర్జాతీయ క్రికెట్ ఆడాడు. అప్పుడు చీలమండ గాయం అవడంతో లండన్ వెళ్లి సర్జరీ చేయించుకున్నాడు. కోలుకొని ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాడు. వాస్తవానికి బోర్డర్ – గావస్కర్ ట్రోఫీకి ఎంపికవుతాడని అంతా భావించారు. కానీ, పూర్తి ఫిట్‌నెస్ లేకపోవడం వల్ల చివరి నిమిషంలో

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 **SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**